నత్తనడకగా..



- ఆగిన నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణ పనులు
- పెండింగ్‌లో బిల్లులు
- పనులు చేపట్టని కాంట్రాక్టర్
- గతంలో ఓ ప్రజాప్రతినిధికి ముడుపులు?

కర్నూలు న్యూసిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణం ఆగింది. రూ.28 కోట్లతో 2022 సంవత్సరం ఆగస్టు 1న అప్పటి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కమిషనర్, అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. అన్ని హంగులతో నూతన అత్యాధునిక టెక్నాలజీతో రెండు బ్లాక్‌ను నిర్మించేందుకు నిర్మాణం చేపట్టారు. ప్రారంభించి 33 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఇంకా మొదటి బ్లాక్ రెండు అంతస్తులు.. రెండవ బ్లాక్ ఒక్క అంతస్తు మాత్రమే నిర్మించారు. ప్రారంభించిన రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తారని కడపకు చెందిన ఓ బడా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. మధ్యలో ఒక నెల ఎలాంటి పనులు చేయకుండా కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. అధికారులు తనకు సహకరించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

రూ.9.50 కోట్ల పుష్కరాల నిధులు

సంస్థ నూతన భవన నిర్మాణానికి మిగిలి ఉన్న రూ.9.50 కోట్ల పుష్కరాల నిధులను ఉపయోగించేందుకు కౌన్సిల్‌లో ఆమోదించారు. మొత్తం రూ.28 కోట్ల అంచనాతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. మిగిలిన నిధులు ప్రభుత్వం, కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని తీర్మానించారు.

ఇష్టానుసారంగా భవన నిర్మాణం

అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకు రాక పోవడంతో ఇష్టానుసారంగా భవనాన్ని నిర్మిస్తు న్నారు. మరో బ్లాక్ నిర్మాణ కేవలం పునాదులు తీసి ఒక్క అంతస్తు మాత్రమే నిర్మిస్తున్నారు. ఇక్కడ ఆధునాతన భవన నిర్మాణం జరుగుతుండగానే ప్రస్తుతం ఉన్న కార్యాలయంలోని కొన్ని విభాగాల్లో అనవసరంగా మరమ్మతులు చేసి ప్రజాధనం దుర్వి నియోగం చేస్తున్నారు. మరో బ్లాక్ నిర్మించాలనే ఉద్దేశంతో మేయర్‌కు కమిషనర్ రూం కేటాయించారు. కమిషనర్‌కు అడిషనల్ కమిషనర్ రూమ్ కేటాయించారు. అదేవిధంగా స్టాండింగ్ కమిటీ రూమ్‌ను అడిషనల్ కమిషనర్‌కు ఇచ్చారు. మొదటి బ్లాక్‌లో కనీసం అధికారులకు సంబంధించి నిర్మాణాలు పూర్తిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రజాధనం దుర్వినియోగం చేయడంతో పాటు భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

ఓ ఉద్యోగికి కాంట్రాక్టర్ ముడుపులు?

ఇంత పెద్దమొత్తంలో భవన నిర్మాణం జరుగుతుండటంతో గతంలో కొందరు అధికారులు, ఓ ప్రజాప్రతినిధికి కాంట్రాక్టర్ పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం. కార్పొరేషన్‌లో అప్పటి కీలక అధికారి వద్ద సహాయకుడిగా పని చేస్తున్న ఓ ఉద్యోగికి కూడా ఆ కాంట్రాక్టర్ పెద్ద మొత్తంలో చెల్లిం చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయం ఆ అధికారికి తెలియకుండా ఉద్యోగి జాగ్రత్త వహించారు. తెలిస్తే ఎక్కడ తన ఉద్యోగానికి ఎసరు వస్తుందోనని భయంతో ఉద్యోగం చేసేవాడు. కేవలం భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగేందుకు సహకరిం చిన అధికారులు, ప్రజాప్రతినిధికి ముడుపులు అందాయి. ఈ క్ర మంలోనే ఇప్పటివరకు భవన నిర్మాణంపై అధికారులు, ప్రజా ప్రతినిధి ఒక్కసారి కూడా అటువైపు చూడలేదు.

సీఎఫ్ఎంఎస్ నుంచి బిల్లులు రావాలి

నిర్మాణానికి సంబంధించి చేసిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేశాం. సీఎఫ్ఎంఎస్ నుంచి బిల్లులు రావాల్సి ఉంది. నిర్మాణం జరుగుతూనే ఉంది. ఆగిపోయే ప్రసక్తి లేదు. గతంలో పెండింగ్‌లో ఉండే బిల్లులు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే నిర్మాణ పనులు వేగవంతమవుతాయి.

● శేషసాయి, ఇన్‌చార్జి ఎస్ఈ, నగరపాలక సంస్థ

పనులు ఆపేసిన కాంట్రాక్టర్

నూతన భవనాన్ని నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు రూ.7 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.28 కోట్లు అంచనా. అయితే 2023 డిసెంబర్‌లో కాంట్రాక్టర్‌కు అప్పటి ప్రభుత్వం రూ.2 కోట్లు చెల్లించారు. 2024 సంవత్సరంలో ఒక్కపైసా కూడా చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేసినట్లు తెలిసింది. అంతే కాకుండా నగర పాలక చెల్లించిన నిధులతో కేవలం గ్రౌండ్‌ఫ్లోర్‌కు సరిపోతుందని, కాంట్రాక్టర్ తన సొంత నిధులతో మొదటి బ్లాక్‌లోని రెండు అంతస్తులకు స్లాబ్ వేసినట్లు తెలిసింది. భవనాన్ని పర్యవేక్షిస్తున్న ముగ్గురు సూపర్‌వైజర్లకు ఏడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైనా బిల్లులు త్వరగా చెల్లించి నిర్మాణ పనులు సాగేలా చూడాలని అధికారులు కోరుతున్నారు.



నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణం

విభిన్న ఆలోచనలతో ముందుకెళ్లాలి

- టెక్నాలజీని వినియోగించుకోండి
- మంత్రి టీజీ భరత్ పిలుపు
- విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం



విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులు గేమ్ చేంజర్స్.. విభిన్న ఆలోచనలతో ముందుకెళ్తే విజయాలు సొంతమవుతాయి..' అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సోమవారం పెద్దపాడు శివారులోని ఓ ఫంక్షన్ హాలులో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారం అవార్డుతో పాటు రూ.20వేలు, సర్టిఫికెట్ అందజేయడం చాలా గొప్ప విషయమన్నారు. ఇలాంటి వినూత్నమైన ఆలోచనలను అమలు చేసి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చరిత్ర సృష్టించారన్నారు. విద్యార్థులు కేవలం సాధకులు మాత్రమే కాదని, భవిష్యత్తులో ప్రపంచాన్ని మార్చేవారు కూడా అవుతారన్నారు. షైనింగ్ స్టార్స్‌గా ఎంపికైన వారు మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు తమ ఆలోచనలను పిల్లల మీద రుద్దవద్దని సూచించారు. పిల్లలు జీవితంలో ఏదీ కావాలనుకుంటున్నారో ఆ దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందిందని, ఈ టెక్నాలజీని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజయాలు సాధించాలన్నారు.

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యకు పేదరికం అడ్డం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని, అన్ని వసతులతో పాటు మంచి ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తోందని చెప్పారు. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ రెసిడెన్షియల్ పాఠశాలకు ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన 142 మంది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన 35 మంది విద్యార్థులకు మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, జాయింట్ కలెక్టర్ బినవ్య, డీఈవో శామ్యూల్ పాల్ మెడల్స్, సర్టిఫికెట్‌తో పాటు రూ.20వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సందీప్ కుమార్, డీవీఈవో సుధీర్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

డిమాండ్లను పరిష్కరించాలి

ఇంజనీరింగ్ కార్మికుల నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగర పాలక కార్యాలయం నుంచి చిన్నపార్కు, రాజ్‌విహార్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.24.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సమీర్ బాషా, ఉపాధ్యక్షుడు నాగేషులు, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు యాసిన్‌బేగ్, గంగమ్మ, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

జాయింట్ కలెక్టర్ బి.నవ్య



యోగాంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ బి.నవ్య

కర్నూలు న్యూసిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య పిలుపునిచ్చారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం ఉదయం కలెక్టరేట్ గాంధీ విగ్రహం నుంచి రాజ్‌విహార్ సర్కిల్ వరకు నిర్వహించిన మాస్ ర్యాలీని జేసీ ప్రారంభించారు. మూడు బెలూన్లను గాలిలోకి వదిలి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ యోగాసనాల ద్వారా మనసు ప్రశాంతంగా ఉండటంతో మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, డీటీసీ శాంతకుమారి, డీఎస్‌వో రాజారఘువీర్, డీఎంఅండ్‌హెచ్‌వో శాంతికళ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, నగరపాలక మేనేజర్ చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

27న డాక్ అదాలత్

కర్నూలు న్యూసిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో అందిస్తున్న సేవలపై ఈనెల 27న డాక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దనరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండు వద్ద ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. డాక్ అదాలత్‌లో పోస్టాఫీసు సేవలపై ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే పోస్టు కవర్ ద్వారా పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దనరెడ్డి, కర్నూలు డివిజనల్ కార్యాలయం, పాతబస్టాండు అడ్రసుకు ఈ నెల 23వ తేదీలోగా పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీడీపీలోనే బీసీలకు గుర్తింపు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి
- మార్కెట్‌యార్డు చైర్మన్‌గా కురువ మల్లయ్య ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీనవర్గాలదని.. తమ పార్టీ అందరిదని జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. టీడీపీలో పదవులు కొందరికే కాదని అందరికి సొంతమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి తన నియోజకవర్గంలో నిరూపించారన్నారు. సోమవారం ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. మార్కెట్ యార్డు కమిటీ అధ్యక్షుడిగా కురువ మల్లయ్య, వైస్ చైర్మన్‌గా బోయ అంజితో పాటు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎంపికలో సామాజిక న్యాయం పాటించి అన్నివర్గాల వారిని డైరెక్టర్లుగా ఎంపిక చేయడం అభినంద నీయమన్నారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ సామాజిక న్యాయంతో ముందుకు సాగుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో పార్టీకోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ పదవులు వస్తాయన్నారు. కార్యక్రమంలో కురువ, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్లు దేవేంద్రప్ప, బొజ్జమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి తదితరులు హాజరయ్యారు.



మాట్లాడుతున మార్కెట్ యార్డు చైర్మన్ కురువ మల్లయ్య

ప్రణాళికాబద్ధంగా..



ముందస్తు వర్షాలతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. నంద్యాల జిల్లా వ్యవసాయ యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఎంత మేర ఎరువులు, విత్తనాలు అవసరమో అంచనాలు వేస్తోంది. గత ఖరీఫ్ సీజన్‌లో 2.6లక్షల హెక్టార్ల లక్ష్యంతో ముందుకెళ్లి 100శాతం ఫలితాన్ని సాధించింది. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉండడంతో మరో 40వేల హెక్టార్లలో అదనంగా పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తూ అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు సన్నద్ధమవుతోంది. సబ్సిడీ విత్తనాలను సైతం అందించనున్నారు. జిల్లాలో వివిధ గోదాములు, హోల్‌సేల్, రిటైల్, మార్క్‌ఫెడ్ వద్ద ఎరువులు 79,841 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచిస్తున్నారు.

- ఖరీఫ్‌కు సిద్ధమైన వ్యవసాయ యంత్రాంగం
- విత్తనాలు, ఎరువులపై అంచనాలు
- గిరిజన ప్రాంత రైతులకు 90శాతం రాయితీ

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మే నెలలోనే వరుణుడు కరుణించడంతో ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధమయ్యారు. జిల్లా వ్యవసాయశాఖ, కృషి విజ్ఞాన కేంద్రం ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేశాయి. విత్తనాల నుంచి ఎరువుల వరకు ఎంత మేరకు అవసరమనే దానిపై అధికారులు అంచనాలు రూపొందించారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, కేవలం పెట్టుబడి నిధి విడుదల చేసి చేతులు దులుపుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక విజన్-2047 ప్రణాళికతో ముందుకు వెళుతోంది. 2025-26 సంవత్సరంలో ప్రధాన పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, అపరాల విస్తీర్ణం పెంచడమే కాకుండా పంట దిగుబడులు పెంచేందుకు ప్రణాళికతో అడుగులు వేస్తోంది.



ట్రాక్టర్‌తో దున్నుతున్న దృశ్యం

లక్ష్యాన్ని అధిగమించేందుకు..

వ్యవసాయశాఖ గత ఖరీఫ్ సీజన్‌లో 2.6లక్షల హెక్టార్ల లక్ష్యంతో ముందుకెళ్లి 100శాతం ఫలితాన్ని సాధించింది. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉండడంతో మరో 40వేల హెక్టార్లలో అదనంగా పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తూ అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేందుకు సన్నద్ధమవుతోంది. ప్రధాన పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, ఇతర అపరాల సాగు విస్తీర్ణంతో పాటు మంచి దిగుబడులు పెంచేవిధంగా నియోజకవర్గాల వారీగా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.



సబ్సిడీ ఇలా...

జిల్లాలో ముందుగా వేరుశనగ విత్తనాలకు 40శాతం సబ్సిడీ, గిరిజన ప్రాంత రైతులకు 90శాతం సబ్సిడీతో విత్తనాలను అందించనున్నారు.

వేరుశనగ సబ్సిడీ: వేరుశనగలో కే6, టీసీజీఎస్, టీఏజీ224 రకాల అసలు ధర రూ. 9300 కాగా 40శాతంతో సబ్సిడీ రూ. 5580 గిరిజన ప్రాంత రైతులకు 930కు అందజేయనున్నారు. నారాయణి రకం అసలు ధర రూ. 9500, సబ్సిడీతో రూ.5700, గిరిజన ప్రాంత రైతులకు రూ. 950, కదిరిలేపాక్షి రకం అసలు ధర రూ.8200, సబ్సిడీతో రూ. 4920, గిరిజన ప్రాంత రైతులకు 820కు అందిస్తారు.

మినుములు : పీయూ31, ఎల్‌బీజీ752, ఐపీయూ243, టీబీజీ104, ఎల్‌జీజీ 630, వీబీఎన్8తో పాటు ఇతర రకాలు క్వింటా అసలు ధర రూ.13800 కాగా 40శాతం సబ్సిడీతో రూ.9660, గిరిజన ప్రాంత రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.1380కు అందజేస్తారు.

మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయుల నిరసన



నిరాహార దీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్జీటీలకు మాన్యువల్‌గానే బదిలీ కౌన్సెలింగ్ చేపట్టాలని ఉపాధ్యాయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ టీచర్లకు వెబ్‌ఆప్షన్ ద్వారా బదిలీ చేయడం సరికాదన్నారు. విద్యా శాఖ వెబ్ ఆప్షన్ ద్వారా బదిలీలు చేపడుతూ ఉపాధ్యాయుల మనోభావాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్టా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, పీఆర్‌టీయూ గౌరవాధ్యక్షుడు కరుణానిధిమూర్తి, ఎస్టీయూ ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, యూటీఎఫ్ రవికుమార్, పీఆర్‌టీయూ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, గోకారి, ఆపస్, ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి, నాగస్వామి నాయక్, ఇస్మాయిల్, మరియానందం పాల్గొన్నారు.

మహిళల జోలికొస్తే ఖబడ్దార్

నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

7

ఎంజాయ్



ఆట, పాటల సరదాల పార్కు



- సుందరంగా నంద్యాల చిన్నపార్కు
- బెంగళూరు, హైదరాబాద్ తరహాలో అభివృద్ధి
- పచ్చదనంతో పాటు బోటింగ్ సదుపాయం
- ఫొటో, వెడ్డింగ్ షూట్లకు సౌకర్యాలు
- సెలవులు, సాయంత్రం వేళల్లో సందడే.. సందడి



చిన్నారులకు కలర్ బాల్స్ బాస్కెట్



చెరువులో బోటు షికారు

నంద్యాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్నచెరువు స్థానికులకు ఆహ్లాదాన్ని అందిస్తోంది. తక్కువ ఖర్చుతో పిల్లలు, పెద్దలకు అన్నీ లభించేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బెంగళూరు, హైదరాబాదులో ఉండే పార్కు తరహాలో పార్కును వైభవంగా విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేశారు. పచ్చదనంతో పాటు చెరువులో బోటింగ్ సదుపాయం ఉంది. ఎగ్జిబిషన్ తరహాలో పిల్లలకు తగిన ఉయ్యాలలు, జారుడు బండ.. చిన్ని పిల్లల బోటింగ్ తొట్టే.. ఎగిరే మ్యాట్ తదితర ఏర్పాట్లు చేయడంతో కనువిందుగా ఉంది. వీటికి తోడు ఫొటో, వెడ్డింగ్ షూట్‌లకు సైతం తగిన విధంగా ఏర్పాట్లు ఉండటం యువతీ యువకులకు మరింత కలిసివస్తోంది. ఇదే క్రమంలో నగరవాసులు సైతం ఏమాత్రం సమయం దొరికినా.. సాయంత్రం వేళల్లో తమపిల్లలతో కలిసి ఈపార్కుకు తరలిరావడంతో సందడి.. సందడిగా కనిపిస్తోంది. శని, ఆదివారాల్లో, సెలవుల్లో దినాల్లో అయితే రద్దీ మరీ ఎక్కువగా ఉంటుంది. రెస్టారెంట్, హోటల్. తినుబండారుల సదుపాయం కూడా ఉంది. ఏదిఏమైనా నంద్యాల వాసులకు చిన్నపార్కుతో పెద్ద సంతోషమే దక్కిందని చెప్పవచ్చు.



ప్రణాళికాబద్ధంగా..

(5వ పేజీ తరువాయి)

పెసలు విత్తనాలు : ఐపీఎం2-14, ఐపీఎం205-7, ఎల్‌జీజీ630, ఐపీఎం410-3రకాలతో పాటు ఇతర రకాల క్వింటా అసలు ధర రూ.13,500 కాగా 40శాతం సబ్సిడీతో రూ.9450లు, గిరిజన ప్రాంత రైతులకు రూ.1350కు అందజేస్తున్నారు.

కందులు : ఎల్‌ఆర్‌జీ52, ఎల్‌ఆర్‌జీ105, పీఆర్‌జీ176, ఐసీపీఎల్87119 రకం విత్తనాలతో పాటు ఇతర రకాలు క్వింటా సబ్సిడీతో రూ.9,855, గిరిజన ప్రాంత రైతులకు రూ.1,095లకు అందజేస్తున్నారు.

కొర్రలు.. :ఎస్ఐఏ3156, ఎస్ఐఏ3159 విత్తనాలతో పాటు ఇతర రకాలు క్వింటా 40శాతం సబ్సిడీతో రూ.9855, గిరిజన ప్రాంత రైతులకు రూ.1,095కు అందజేస్తున్నారు.

రాగులు సబ్సిడీ ఇలా.. : ఇంద్రావతి, వేగావతి, వీఎల్379 రకాలతో ఇతర రకాలు క్వింటా రూ.6,900 కాగా 40శాతం సబ్సిడీతో రూ.3,450, గిరిజన ప్రాంత రైతులకు రూ.690కు అందజేస్తున్నారు.

జిల్లాలో వివిధ గోదాములు..

జిల్లాలో వివిధ గోదాములు, హోల్‌సేల్, రిటైల్, మార్క్‌ఫెడ్ వద్ద ఎరువులు 79,841 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. ఎరువుల వల్ల రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా బఫర్ స్టాక్ కంటే నిల్వలున్నాయి.

రైతులకు ఖరీఫ్ పంటలపై..

బనగానపల్లె కృషివిజ్ఞాన కేంద్రం రైతులకు ఖరీఫ్ పంటలపై అవగాహన కల్పిస్తూనే సబ్సిడీతో కూడా విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త తమ కేంద్రంలో అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలను వెల్లడించారు. ఎన్‌డీఎల్ఆర్, బీపీటీ 5204 రకం వరి, మినుములు వీబీఎన్8, వీబీఎన్10, టీబీజీ 104 రకాలు 600 క్వింటాళ్లు, కొర్రలు సూర్యనంది రకం 200క్వింటాళ్లు, కందులు ఎల్‌ఆర్‌జీ52, పీఆర్‌జీ 176, డబ్ల్యూఆర్‌జీ 93, డబ్ల్యూఆర్‌జీ 97, డబ్ల్యూఆర్‌జీ 255 రకం 800క్వింటాళ్లు, ఆముదాలు ఐసీహెచ్5 రకం 5 క్వింటాళ్లు, సజ్జలు 10క్వింటాళ్లు, సోయాబీన్ 118 క్వింటాళ్లు, సన్‌ఫ్లవర్ ఐఎస్ఎఫ్ 764 రకం 5 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



సాగు విస్తీర్ణం పెంచుతాం



గత ఏడాది కంటే ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండడంతో సాగు విస్తీర్ణం కూడా పెంచేందుకు కృషిచేస్తాం. రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించడంతో అధిక దిగుబడులు సాధించొచ్చు. ప్రభుత్వం జిల్లాకు విత్తనాల కోసం రూ.268.4లక్షలు సబ్సిడీ కేటాయించింది.

● మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో వ్యవసాయ దిగుబడిని పెంచడానికి కేవీకే ఆధ్వర్యంలో మే 29వ తేదీ నుంచి 15 రోజుల పాటు 135 గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించబోతున్నాం. కేవీకేలో అన్నిరకాల విత్తనాలు సిద్దంగా ఉన్నాయి. రైతులు సందర్శించి విత్తనాలను పరిశీలించి కొనుగోలు చేయవచ్చు.

●డాక్టర్ ధనలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే

రైతులు ఆందోళన చెందొద్దు



జిల్లాలో బఫర్‌స్టాక్ కంటే ఎరువులు అధికంగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధిక మోతాదులో కాంప్లెక్స్ ఎరువులను వాడకుండా వ్యవసాయాధికారుల సూచనలను పాటించి ఎరువులు వాడడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులుండవు.

● హరినాథరెడ్డి, మార్క్‌ఫెడ్ మేనేజర్, నంద్యాల

మహానందిలో మంత్రులు

- ఘనస్వాగతం పలికిన ఆలయ ఈవో, అర్చకులు
- స్వామివారి జ్ఞాపికలు అందజేత



మహానందిలో రాష్ట్ర మంత్రులకు స్వామి వారి జ్ఞాపికలను అందజేస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తో పాటు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అలంకార మంటపంలో మంత్రులను వేదపండితులు ఆశీర్వదించారు. ఈవో శాలువాలతో సన్మానించి స్వామివారి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కేసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి, ఏఈవో యర్రమల్ల మధుతోపాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కోసిగిలో మాతృమరణంపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హాస్పిటల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలో ఏప్రిల్ నెలలో జరిగిన బాలింత మృతిపై డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పెద్దహరివాణం నుంచి కోసిగి పీహెచ్‌సీకి కాన్పు కోసం వచ్చిన బాలింత మృతిపై గల కారణలపై అరా తీశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భవతులను తొందరగా గుర్తించి వారికి సరైన సమయంలో సేవలు అందిస్తే మాతృ మరణాలు తగ్గుతాయన్నారు. ఒకవేళ గర్భవతులను హైరిస్క్‌గా గుర్తించినట్లు ఆశా, ఆరోగ్య కార్యకర్త పర్యవేక్షణలతో ట్రాక్ చేసి సమీప సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భవతులను కాన్పు తేదీకి మూడు రోజుల ముందుగానే ట్యాగ్ చేసిన వారిని ఆసుపత్రిలో అడ్మిషన్ అయ్యేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో డీఐవో, డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి నాగేంద్ర ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, గైనకాలజీ హెచ్‌వోడీ శ్రీలక్ష్మి, అనస్థీషియా ప్రొఫెసర్ సుధీర్ కుమార్, డీపీహెచ్ఎన్‌వో అన్నపూర్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు అభిరూప్, ఇర్ఫాన్‌బాషా, పీహెచ్ఎన్ మీనాక్షి, ఎంపీహెచ్ ఈవో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

ఆర్డీవోపై వచ్చిన ఆరోపణలపై విచారణ

11న విచారణకు రావాలని వీఆర్‌ఓలకు జేసీ నోటీసులు

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, ఆయన క్యాంప్ క్లర్క్‌పై వచ్చిన అక్రమ వసూళ్లు, వేధింపుల ఆరోపణలపై జాయింట్ కలెక్టర్ బి.నవ్య విచారణకు ఆదేశించారు. 11వ తేదీ బుధవారం ఉదయం విచారణకు హాజరు కావాలని పత్తికొండ డివిజన్ వీఆర్వోల అసోసియేషన్ సభ్యులతో పాటు డివిజన్ పరిధిలోని ప్రతి మండలం నుంచి ఇద్దరు గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్‌వో)లు హాజరు కావాలని సోమవారం జేసీ నోటీసులు జారీ చేశారు. ఆర్డీవోతో పాటు ఆయన క్యాంప్ క్లర్క్ అక్రమ వసూళ్లు చేయాలని, వివిధ రకాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ పత్తికొండ డివిజన్ వీఆర్వోల అసోసియేషన్ పేరిట జిల్లా కలెక్టర్, ఏపీ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ)కు గత నెల 20వ తేదీన ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను పంపాలని సీసీఎల్‌ఏ అధికారులు కర్నూలు జేసీ నవ్యను ఆదేశించారు. ఇదిలా ఉండగా మండలానికి ఇద్దరు వీఆర్వోలు మాత్రమే హాజరుకావాలని కోరడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

రేపు కాకినాడలో కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల హాస్పిటల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బాల, బాలికల జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్ల ఎంపిక పోటీలు బుధవారం కాకినాడలో నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యుడు సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని జేఎన్‌టీయూ మైదానంలో ఈనెల 11వ తేదీ ఉదయం 7గంటలకు ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్-18 విభాగంలో ప్రతిభ కనబరచిన బాల, బాలికల ఆంధ్రా జట్లకు ఎంపిక చేస్తారని, ఎంపికైన ఏపీ జట్లు ఈ నెల 28నుంచి జూలై 1వరకు హరిద్వార్‌లో జరిగే జాతీయస్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటాయని వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు నేరుగా ఆధార్‌కార్డుతో కాకినాడకు వెళ్లి పాల్గొనవచ్చని సూచించారు. బాల, బాలికలు డిసెంబరు 31నాటికి 18సంవత్సరాలు దాటరాదని, బాలురు 70కేజీలు, బాలికలు 60కేజీల్లోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9441243601 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం విజన్ ప్లాన్

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- సీపీవోలో యూనిట్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, జేసీ బి.నవ్య

కర్నూలు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సోమవారం సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 26 జిల్లాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను, 175 నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి భరత్‌తో పాటు జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీ.క్యాంపు క్రీడా మైదానంలో ఈ నెల 11వ తేదీన స్త్రీ, పురుషులకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి బి.లక్ష్మయ్య తెలిపారు. 18 సంవత్సరాలు వయస్సు పైబడిన ఎంపికకు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అథ్లెట్స్ ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెట్స్ చాంపియన్‌షిప్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పాటు రూ.300 ప్రవేశ రుసుంతో హాజరు కావాలన్నారు.

ఆశల సాగు ఆవిరి..!

- భారీగా పతనమైన బొప్పాయి ధర
- గత నెల టన్ను రూ.20 వేలు
- ప్రస్తుతం రూ.5 వేలకు పతనం
- తోటలను దున్నేస్తున్న రైతులు



బొప్పాయి చెట్లకు కాచిన కాయలతోనే వదిలేసిన పంట పొలం

చాగలమర్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో పంటలను సాగు చేసిన రైతుకు వరుస నష్టాలు ఎదురవుతున్నాయి. పండ్ల తోటల సాగుతోనైనా కష్టాలు గట్టెక్కుతాయనుకున్న ఆ రైతుకు మళ్లీ నిరాశే ఎదురైంది. ధర లేక బొప్పాయి రైతులు కుదేలవుతున్నారు. పెట్టుబడి కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే టన్నుకు రూ.15 వేలకు పైగా ధర పడిపోవడంతో ఏమి చేయాలో రైతులకు దిక్కుతోచలేదు. చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో సోమవారం కొందరు రైతులు ఆశలు వదులుకొని బొప్పాయి తోటలను ట్రాక్టర్లతో దున్నేశారు. ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశామని, ధరలు లేక బొప్పాయి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు శీలం అంకిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి, సందీశ్వర్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 20 ఎకరాల దాకా బొప్పాయి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. కొందరు రైతులు బొప్పాయి చెట్లకే కాయలను వదిలేశారు. గత రెండు నెలల క్రితం టన్ను రూ.20 వేలు పలికిందని, ప్రస్తుతం ధర రూ.5 వేలకు పడిపోయిందని వాపోయారు. చెట్లకు కాయలు ఉన్నా పెట్టుబడులు కూడా రావని ట్రాక్టర్లతో దున్నేస్తున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలు, వైరస్ వల్ల కూడా పంట దెబ్బతిందని రైతులు విలపించారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.



చిన్నవంగలిలో బొప్పాయి తోటను దున్నేస్తున్న రైతు

పోలీసులకు 95 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 95మంది తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. తన నలుగురు కుమారులు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన కె.సుంకులమ్మ ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. తన కుమారుడు వినయ్ కుమార్ (34) ఏడాది నుంచి కనిపించడం లేదని ఆచూకీ తెలపాలని కర్నూలు జోహరాపురం గ్రామానికి చెందిన స్వామిదాసు ఫిర్యాదు చేశాడు. వెల్దుర్తికి చెందిన శ్రీశైలం వాసు తన పొలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని కర్నూలు చెందిన రవి ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా తమ పొలానికి వెళ్లకుండా కంచె అడ్డు వేసి బెదిరిస్తున్నారని సీ.బెళగల్ మండలం కంపాడు గ్రామానికి చెందిన పార్వతి వెంకటేష్, గోవిందుపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ హుశేన్‌పీరా, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనూరాధ అర్జీలను స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను అధికారులు స్వీకరించి ఆయా శాఖలకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా పీడీ చిరంజీవి మాట్లాడుతూ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. కాగా కలెక్టర్, జేసీలు వేర్వేరు కార్యక్రమాలతో బిజీగా ఉన్న నేపథ్యంలో హౌసింగ్ పీడీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజా వినతులను స్వీకరించారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

గూడు చెదిరి... గుండె పగిలి...

- అనారోగ్యంతో నాన్న...ఆవేదనతో అమ్మ మృతి
- 40 రోజుల్లో తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులు

చాగలమర్రిలో విషాద ఘటన

ఏమైందమ్మా..
ఎందుకమ్మా.. ఇలా చేశావు.?
మొన్న నాన్న.. నేడు నువ్వు
మమ్మల్ని ఇలా వదిలేసి
వెళ్లిపోయారు.. ఎందుకమ్మా?
రాత్రి కడుపునిండా అన్నం పెట్టి
ప్రేమతో హత్తుకుని పడుకున్నావు..
తెల్లారేసరికి
మంటల్లో కలసిపోయావు
రాత్రే కదమ్మా హాయిగా నవ్వి..
నుదుటిపై ముద్దుపెట్టి
కలసి పడుకున్నాం..
తెల్లారేసరికి ఎక్కడకు వెళ్లావమ్మా..?
భరోసానిచ్చే నాన్న
బాధ్యతగా పెంచే అమ్మ
లేకపోతే మేమెలా బతకాలి
అమ్మా, నాన్న లేని
మాకు ఇంకెవరు దిక్కు?
మా చదువులు,
మా బతుకులు చూసేదెవరు
లాలించి, ఆడించి
ఇష్టమైనవి కొనిపెట్టేదెవరు?
అవన్నీ మాకేం వద్దమ్మా..
మాకు మీరే కావాలి..
మీరే కావాలి..!



అమ్మానాన్నల ప్రేమకు దూరమైన చిన్నారులు జాహ్నవి, హరిత



40 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన తండ్రి పవన్



ఆత్మహత్య చేసుకున్న మహేశ్వరి (ఫైల్)

చాగలమర్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చూడ చక్కని ఇద్దరు ఆడబిడ్డలు.. తల్లిదండ్రులతో హాయిగా సాగిపోతున్న వారి జీవితాన్ని అప్పులు, అనారోగ్యం కుదిపేశాయి. రుణదాతలను మోసం చేయలేకపోయిన ఆ తండ్రి ఉన్న నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలను అమ్మేసి అప్పులు తీర్చాడు. అయినా కాస్త అప్పులు ఉండటం, దానికి తోడు అనారోగ్యం తోడు కావడంతో సరిగ్గా 40 రోజుల క్రితం మృతి చెందాడు. ప్రేమగా చూసుకునే భర్త లేకపోవడంతో ఆ తల్లి కూడా కన్నీటిని దిగమింగి బిడ్డలకు కడుపు నిండా అన్నం పెట్టి వారు నిద్రలోకి వెళ్లాక... ఈమె శాశ్వత నిద్రలోకి వెళ్లింది. బిడ్డలకు ఏమీ కాకూడదని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. 50 రోజుల క్రితం సంతోషంగా కనిపించిన ఆ కుటుంబం చెల్లాచెదురైంది. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ బిడ్డలు అనాథలయ్యారు. ఈ ఘటన చాగలమర్రి మండలంలో చోటు చేసుకుంది.

చాగలమర్రి గ్రామంలోని న్యూబిల్డింగ్స్ వీధిలో నివాసం ఉంటున్న వివాహిత మహిళ మహేశ్వరి (30) ఆర్థిక ఇబ్బందుల కారణంతో నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చిన్నవంగలి గ్రామానికి చెందిన పవన్, మహేశ్వరికి పదేళ్ల క్రితం వివాహం అయింది. వారు చాగలమర్రిలో అద్దె భవనంలో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. స్వగ్రామంలో 4 ఎకరాల పొలం ఉండగా అప్పుల ఒత్తిడి తట్టుకోలేక 2 ఎకరాలను విక్రయించి కొంతమేర అప్పులు చెల్లించారు. 40 రోజుల క్రితం అనారోగ్యంతో భర్త పవన్ మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు, భర్త లేని లోటుతో భార్య మహేశ్వరి ఒత్తిడికి లోనైంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇద్దరు కుమార్తెలు జాహ్నవి, హరితలకు కడుపు నిండా ఇష్టమైన భోజనం చేసి తండ్రితో కలిసి మహేశ్వరి తినింది. తన ఇద్దరి బిడ్డలను హత్తుకుని నుదుటిపై ముద్దాడుతూ.. 'మంచిగా ఉండాలి. ఎవరితోనూ గొడవలు పెట్టుకోవద్దు. ఎక్కడ ఉన్నా ఏమైనా మీకోసం నాప్రాణం..' అంటూ బిడ్డలకు చెప్పుకుంది. అనంతరం బిడ్డలు నిద్రలోకి వెళ్లాక పక్క గదిలోని ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. మహేశ్వరి తండ్రి కృష్ణమూర్తి, చిన్నారులు జాహ్నవి, హరితలను పక్క గదిలో నిద్రించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గృహంలో నుంచి మంటలు వ్యాపించడంతో పక్కనే నివాసం ఉంటున్న విశ్రాంత ఈవో మారుతీప్రసాద్, మల్లేశ్వరరావులు స్పందించి మంటల వేడిని తట్టుకోలేక కేకలు వేశారు. చిన్నారులను, కృష్ణమూర్తిని సాహసంతో బయటకు తరలించారు. ఆళ్లగడ్డ అగ్నిమాపకదళ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే మంటల్లో మహేశ్వరి కాలిపోయింది. గృహంలో ఉన్న నగదు, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మహేశ్వరిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లిదండ్రులను కోల్పోయి గూడు చెదిరిన పక్షుల్లా చిన్నారులు జాహ్నవి(7), హరిత(4)లు మిగిలారు. భర్త చనిపోయిన మహేశ్వరి పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగించేది. తన తండ్రి కృష్ణమూర్తికి ఎవరు లేక పోవడంతో ఆమె వద్దె ఉంటూ కాలం గడుపుతున్నాడు. తల్లి మంటల్లో కాలి చనిపోవడంతో ఆ చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలుగా మిగిలారు. ఈ సంఘటన పలువురిని కలచివేసింది.



మహేశ్వరి ఆత్మహత్య చేసుకున్న గదిలో దగ్ధమైన నగదు, వస్తువులు

దేవరలో విద్యుదాఘాతంతో మహిళ మృతి

- మరో ముగ్గురికి అస్వస్థత

దొర్నిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ దేవరలో సోమవారం ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మరో ముగ్గురు మహిళలు అస్వస్థతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. దొర్నిపాడుకు చెందిన బోయ బాల ఉసేని భార్య ఉష పెద్దమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం డబ్ల్యూ.గోవిందిన్నెకు చేరుకుంది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసేందుకు జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఇనుప స్తంభానికి లైట్ ఏర్పాటుచేశారు. విద్యుత్‌తీగ కాస్త తెగి స్తంభానికి తగిలి ఉండటంతో ప్రమాదవశాత్తు ఉష విద్యుత్ షాక్‌కు గురై స్పృహ కోల్పోయింది. తోటి భక్తులు గమనించి ఉషను తప్పించబోయారు. దీంతో మరో ముగ్గురికి షాక్ తగలడంతో అస్వస్థతకు గురయ్యారు. వీరందరిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఉష మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

కంకరమిషన్ కింద పడి కాంట్రాక్టర్ దుర్మరణం

- మృతుడు హైదరాబాద్ వాసి

బనగానపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కంకర మిషన్ కిందపడి ఓ కాంట్రాక్టర్ సోమవారం దుర్మరణం చెందాడు. పట్టణ సమీపంలో రైల్వేస్టేషన్ వద్ద ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ అజయ్(59) బనగానపల్లె రైల్వేస్టేషన్ వద్ద పనులు చేయిస్తున్నాడు. ఈనేపథ్యంలో కంకర, సిమెంట్ కలిపే మిషన్ డ్రైవర్ కంకరమిషన్, సిమెంట్ కలిపి ఆ మిశ్రమాన్ని సమీపంలోని ప్రాంతానికి తీసుకు వెళ్లడానికి వాహనాన్ని నడుపుతున్నాడు. అదే సమయంలో కాంట్రాక్టరు సెల్‌ఫోన్‌లో వేరే వారితో మాట్లాడుతుండగా కంకరమిషన్ వెనుకవైపు నుంచి తగిలి మిషన్ టైరుకింద పడి తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే రైల్వే ఉద్యోగులు, ఇతర సిబ్బంది కొనఊపిరితో ఉన్న అజయ్‌ను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కాంట్రాక్టర్ బంధువుల ఫిర్యాదు మేరకు మిషన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక..

పెద్దకడుబూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగిన బాలిక చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పెద్దకడుబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన కురువ నాగవేణి (14) ఈనెల 4వ తేదీన కౌతాళం మండలం ఉరుకుంద గ్రామానికి ఓ పెళ్లికి వెళ్లింది. అక్కడ తన బంగారం పోగొట్టుకోవడంతో తల్లిదండ్రులు కొడుతారని భయపడింది. ఈనెల 6వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలిక మరణించింది. మృతురాలి తండ్రి కురువ అయ్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

- పావు కిలో బంగారం, కిలో వెండి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్

నంద్యాల టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పలు దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరిని నంద్యాల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం నంద్యాల సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శివశంకర్ అలియాస్ లడ్డు రాయవరం కోనసీమ జిల్లా, కొరాడ వెంటేశ్వరావు, భిక్కవోలు రాజమహేంద్రవరం జిల్లా ఇద్దరు కలసి పలుచోట్ల దొంగతనాలు చేసేవారు. వీరిద్దరిపై పశ్చిమగోదావరి జిల్లా రేవనూరు, గుంటూరు, హైదరాబాద్, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఒకరిపై 20 కేసులు, మరోకరిపై 40 దొంగతనం కేసులు నమోదయ్యాయి. వీరు ఉదయంపూట రెక్కీ నిర్వహిస్తూ ఇళ్లల్లో ఎవరూ లేని చూసి తాళాలు ధ్వంసం చేసి దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో నంద్యాల జరిగిన ఓ చోరీ కేసులో నిందితులపై కేసు నమోదైంది. నంద్యాల ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పాణ్యం మండలంలోని సుగాలిమెట్ట వద్ద ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పావుకిలో బంగారు, కిలో వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టులో కీలక పాత్ర పోషించిన పోలీసులను ప్రత్యేకంగా అభినందిచారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ సురేశ్‌కుమార్, పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, తాలుకా సీఐ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల జోలికొస్తే ఖబడ్దార్

- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్
- సాక్షి కార్యాలయం ఎదుట జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్ దిష్టిబొమ్మ, సాక్షి ప్రతులను దహనం చేస్తున్న నాయకులు



నిరసన తెలుపుతున్న మహిళలు

కల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి, మహిళల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ మెంబర్ మల్లెల రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం సాక్షి కార్యాలయం ముందు మహిళలు ధర్నా చేసి జగన్ దిష్టిబొమ్మను, సాక్షి పేపర్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మల్లెల మాట్లాడుతూ ఈనెల 6న సాక్షి టీవీ డిబేట్‌లో రాజధాని మహిళలను వేశ్యలుగా పేర్కొన్న కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజుపై సుమోటోగా కేసు నమోదుచేసి కోర్టులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసీపీ మహిళా నాయకులు, భారతీరెడ్డి కూడా అక్కడే నివాసం ఉంటున్నారని గుర్తుంచుకోవాలన్నారు. జగన్ కళ్లల్లో ఆనందం కోసం కొందరు పనికట్టుకొని మహిళలపై మతిభ్రమించి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత వైసీపీ పాలనలో అమరావతిపై జగన్ కక్ష సాధించారని, అదే పంథాను ఇప్పుడు కొనసాగిస్తూ వివక్ష చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలు, టీడీపీ నాయకుల జోలికి వస్తే ఇళ్లలోకి వచ్చి కొడతామని మల్లెల హెచ్చరించారు. కార్యక్రమంలో కల్లూరు మండల టీడీపీ కన్వీనర్ డి.రామాంజనేయులు, వాకిటి మాదేష్, మహిళలు పాల్గొన్నారు.

గోసంరక్షణకు రూ.లక్ష విరాళం



దాతకు ప్రసాదం అందజేస్తున్న పర్యవేక్షకురాలు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణ కోసం సోమవారం హైదరాబాదుకు చెందిన ఎస్.ఆర్. అనురాధదేవి రూ.1,00,516-లు విరాళంగా అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు హిమబిందు దాతకు రసీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందించారు. అర్చకుడు దాత అనురాధదేవిని ఆశీర్వదించారు.

గూడ్స్‌రైలు ఢీ.. కణతి మృతి

మహానంది, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలోని చలమ రైల్వే స్టేషన్ సమీపంలోని నల్లమల అడవిలో సోమవారం గూడ్సు రైలు ఢీ కొని కణతి మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న గూడ్సు రైలు కింద వన్యప్రాణి కణతి మృతి చెందిందన్న సమాచారం మేరకు చలమ రేంజ్ అటవీ అధికారి మద్దిలేటి స్వామి సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిశీలించారు. అనంతరం పశువైద్యులు సంఘటనా స్థలంలోనే కణతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా బి.శేషన్న

- డీసీవోగా రామాంజనేయులు

నంద్యాల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పురపాలక కమిషనర్‌గా తెనాలిలో పనిచేస్తున్న బి.శేషన్నను నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కమిషనర్‌గా పనిచేస్తున్న నిరంజన్‌రెడ్డిని విజయవాడలోని ఏపీయూడబ్ల్యూఎస్ ఎస్ఎంఐకీ బదిలీ చేశారు. ఇదిలా ఉండగా.. కర్నూలు జిల్లా సహకార శాఖలో డీసీవోగా పనిచేస్తున్న ఎస్.రామాంజనేయులను నంద్యాల డీసీవోగా ప్రభుత్వం బదిలీ చేసింది.

తక్కువ ధరకే బంగారమంటూ మోసం!

- 24 గంటల్లో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

దేవనకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తమకు బంగారం దొరికిందని, తక్కువ ధరకే విక్రయిస్తామని నమ్మబలికి మోసం చేసిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ వంశీనాథ్ తెలిపిన మేరకు.. మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన కప్పల రంగస్వామి అనే వ్యక్తి వద్దకు ఆదివారం నెల్లూరు జిల్లాకు చెందిన మహిళతోపాటు ముగ్గురు వ్యక్తులు వచ్చి తమకు బంగారం దొరికందని తక్కువ ధరకే విక్రయిస్తామని నమ్మబలికారు. నకిలీ బంగారం గొలుసు చూపి, దాదాపు పది తులాలు ఉంటుందని, అడ్వాన్స్‌గా రూ.1.2లక్షలు అడ్వాన్స్ తీసుకొని మిగిలిన డబ్బును తాము మరలా వచ్చినప్పుడు ఇవ్వాలని ఒప్పందం చేసుకుని ఉడాయించారు. బాధితుడికి అనుమానం వచి పరీక్షలు చేయించగా నకిలీ బంగారంగా తేలింది. తాను మోసపోయానని గ్రహించిన రంగస్వామి దేవనకొండ పోలీసులను ఆశ్రయించాడు. సీఐ వంశీనాథ్ సిబ్బందితో గాలించి 24 గంటలలో నిందుతులను దేవనకొండ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. నిందుతులపై కేసు నమోదు చేసి, పత్తికొండ న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని అప్రమత్తంగా ఉండాలని ప్రజలను సీఐ హెచ్చరించారు.

జిల్లాలో రేంజర్ల బదిలీలు

- రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటరు ఉత్తర్వులు జారీ

రుద్రవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో పనిచేస్తున్న ఫారెస్టు రేంజర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటరు అజయ్‌కుమార్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం ఫారెస్టు శాఖ అధికారులు తెలిపారు. రుద్రవరం రేంజర్ శ్రీపతినాయుడును అనంతపురం సోషల్ ఫారెస్టు డివిజన్‌కు, బనగానపల్లె రేంజర్ సుబ్బరాయుడును తిరుపతి డివిజన్‌కు, నంద్యాల రేంజర్ దినేష్‌కుమార్‌రెడ్డిని రీసెర్చ్ రేంజ్ ఆఫీసరుగా బయోడైవర్సిటీ శ్రీశైలంకు బదిలీ చేశారు. అలాగే శ్రీశైలం రేంజర్ సుభాష్‌ను మదనపల్లె అన్నమయ్య డివిజనుకు, ఆత్మకూరు రేంజర్ పట్టాభిని చిత్తూరు వెస్ట్ డివిజనుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రుద్రవరం రేంజ్‌లో సిబ్బంది..

రుద్రవరం రేంజ్‌లో సిబ్బందిని బదిలీ చేస్తూ నంద్యాల డిప్యూటీ డైరెక్టరు అనురాగ్ మీనా ఉత్తర్వులు జారీచేసినట్లు సోమవారం సాయంత్రం ఫారెస్టు అధికారులు తెలి పారు. డీవీపెంట సెక్షన్ పెద్దఒంగలి బీట్ ఆఫీసరును రుద్రవరం సెక్షన్ మేడంబావి బీట్‌కు, బీట్ ఆఫీసరు సరస్వతిని ఆలమూరు సెక్షన్ నుంచి చెలిమరేంజ్ పెద్దకంబలూరు సెక్షన్‌లోని కోటకొండ బీట్‌కు, నంద్యాల రేంజ్ గడిగుండం బీట్‌లో పనిచేస్తున్న బలరామును భైరేని నార్త్ బీట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రుద్రవరం ఫారెస్టు కార్యాలయంలో పనిచేస్తున్న అటెండరు సుబ్బరాయుడును నంద్యాల ఆఫీసుకు, నంద్యాలలో పనిచేస్తున్న అటెండరు తిమోదిని రుద్రవరం ఫారెస్టు ఆఫీసుకు బదిలీ చేశారు.

జలవనరుల శాఖలో బదిలీలు



నగరంలోని జలమండలి కార్యాలయం

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ కర్నూలు జిల్లా సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్లలో పనిచేస్తున్న పరిపాలన విభాగపు సిబ్బందిని బదిలీలు చేస్తూ సోమవారం ఎస్ఈ బాలచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ పరిధిలోని మైనర్ ఇరిగేషన్, టీబీపీ ఎల్లెల్సీ సబ్‌డివిజన్, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు డివిజన్, కేసీ కెనాల్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న దాదాపు 70 మంది అటెండర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, ఏవోలను ఆయా సబ్ డివిజన్లకు బదిలీచేశారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత సర్కిల్ పరిధిలో 70 మంది వివిధ డివిజన్లు, సబ్ డివిజన్లలో పనిచేస్తున్న పరిపాలన సిబ్బందిని ఇంత పెద్దఎత్తున బదిలీచేయడం ఇదే ప్రథమం. బదిలీ అయిన ఉద్యోగులకు బాలచంద్రా రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

మార్కెటింగ్ శాఖ: కర్నూలు మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ కార్యదర్శిగా అనంతపురంలో పనిచేస్తున్న ఆర్.జయలక్ష్మిని నియమించారు. కర్నూలు సహకార శాఖలో డీసీఓగా వెంకటకృష్ణను నియమించారు ప్రస్తుతం ఈయన కాకినాడలో స్పెషల్ గ్రేడ్ డీఆర్‌గా ఉన్నారు.

ఎమ్మెల్యే అఖిలప్రియకు అస్వస్థత



అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

- హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు

దొర్నిపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలోని మూలపెద్దమ్మ దేవరలో ఎమ్మెల్యే అఖిలప్రియ, భర్త భార్గవ్‌రామ్, సోదరుడు జగత్ విఖ్యాతరెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఉదయం నుంచి ఉపవాసదీక్షలు ఉండి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గండాదీపం మోశారు. ఉన్నఫలంగా స్పృహ కోల్పోవడంతో భర్త, సోదరుడు హుటాహుటిన ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యాధికారి సుజాత వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం నంద్యాల ఎన్‌ఆర్‌టీసీ ఆసుపత్రికి తరలివెళ్లారు. ఎమ్మెల్యే స్పృహ కోల్పోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రి వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించండి: కమిషనర్



కమిషనర్ రవీంద్రబాబుకు సమస్య విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 అర్జీలు వచ్చాయి. ఒక్కొక్క అర్జీదారుడి నుంచి సమస్యను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

త్వరలో తల్లికి వందనం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చదువుకునే ప్రతి విద్యార్థి తల్లుల అకౌంట్లలోకి తల్లికి వందనం పథకానికి సంబంధించిన డబ్బును ఈ నెలలోనే జమ చేస్తామని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. స్థానిక సచివాలయం-2లో నియోజకవర్గ విజయ్ యాక్షన్ ప్లాన్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యం గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యాక్షన్ ప్లాన్‌ను రూపొందిం చారని అన్నారు. ఎన్నికల్లో భాగంగా ఇదివరకే దీపం-2 పథకం కింద ప్రతి ఇంటికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. అలాగే తల్లికి వందనం, ఆగస్టు 15కి మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలను అమలు చేయబోతున్నామని తెలిపారు. ఎన్నికల ముందు చెప్పిన విధంగా పింఛన్ రూ.3వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు డీఎస్సీ అమలు చేసిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానికే సాధ్య మని గుర్తు చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, ఎంపీడీవో రాముడు, తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్, టీడీపీ నాయకులు బడెసాగౌడ్, బలరాం, రాముడు, నారాయణ, అయ్యప్ప పాల్గొన్నారు.

హత్యాచారాలను అరికట్టాలి

కర్నూలు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థులపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. సోమవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సత్యసాయి జిల్లాలో దళిత బాలికపై జరిగిన సామూహిక అత్యాచార సంఘటన మరువక ముందే అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థిని హత్య చేసిన నిందితుల్ని అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి ఘనటలను అరికట్ట డంలో పోలీసులు వైఫల్యం చెందారన్నారు. బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగేలా ఫాస్టు ట్రాక్ కోర్టు ద్వారా 3 నెలల్లో కేసు విచారణ జరిపి నిందితులకు శిక్షించేలా చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌కు శుభాకాంక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెద్దమర్రివీడు గ్రామం లో ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ కురువ మల్లయ్యను కలిసి జిల్లా కురువ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం శ్రీభక్త కనకదాసు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దపాడు ధనుంజయ, పుల్లన్న, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

గూడూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కె.నాగులాపురం సుంకులాపరమేశ్వరి ఆలయానికి నెరవాడ గ్రామానికి చెందిన భక్తులు రూ.10,116 విరాళంగా అందించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు. సోమవారం ఆలయంలో కేశవ మాట్లాడుతూ నెరవాడ గ్రామానికి చెందిన స్వర్ణ రేఖ, మాచిరెడ్డి ప్రదీప్ కుమార్ రెడ్డి దంపతులు ఆలయానికి రూ.10,116 అందజేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ-2024 సంవత్సరానికి గానూ టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు కోసం గత మూడు సంవత్సరాలలో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాలలో అత్యుత్తమ విజయాలు సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్కూరు సీఈవో డాక్టర్ కె.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహస క్రీడలలో తమను తాము అంకితం చేసుకుని నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవితాకాల సాఫల్యం కింద ఈ అవార్డును ప్రతి సంవత్సరం అర్జున అవార్డులతోపాటు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేస్తారన్నారు. అవార్డు గ్రహితలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతోపాటు ప్రశంసాపత్రం, రూ.15లక్షల నగదు అందజేస్తారన్నారు. 2022, 2023, 2024లలో సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు Https://awards.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సీఎం విజనరీతోనే రాష్ట్ర ప్రగతి

- హైదరాబాద్ నేడు విశ్వనగరంగా ఖ్యాతి
- ఒక్కో నియోజకవర్గానికి ఐదుగురితో సాధికార బృందం
- తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు విజనరీతోనే రాష్ట్రం అన్ని విధాలుగా ప్రగతి పథంలో పయనిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గ దార్శనికత కార్యాచరణ కార్యాలయాన్ని మంత్రి కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ విజన్ అనగానే అందరికీ చంద్రబాబే గుర్తుకు వస్తారన్నారు. రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక విజన్-2020కి శ్రీకారం చుట్టారన్నారు. దాని ఫలితంగానే నేడు హైదరాబాద్ విశ్వనగరంగా ప్రఖ్యాతి గాంచిందన్నారు. భావితరాల కోసం విజన్-2047 కార్యక్రమానికి నాంది పలికారన్నారు. రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ స్థాయిలో ప్రజలు, ప్రజాప్రతి నిధుల నుంచి అభిప్రాయాలను తీసుకుని వాటికి విజన్ డాక్యుమెంటరీ రూపొందించి వాటి అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంద న్నారు. ఒక్కొక్క నియోజకవర్గానికి ఐదుగురు విద్యావంతులతో సాధికార బృందాన్ని ఏర్పాటుచేసిందన్నారు. వీరు నియోజకవర్గ అభివృద్ధికి కార్యాచరణ అమలు కోసం పనిచేస్తారని, ఫలితంగా నియోజకవర్గ అభి వృద్ధికి దోహదపడుతుందన్నారు. అనంతరం కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ సాధికార బృందాలకు ఒక కార్యాలయం ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. త్వరలో అన్ని వసతులతో శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతరం విజన్-2047 ప్లాన్ బుక్ లెట్‌ను మంత్రి, అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరా ముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.



విజన్ ప్లాన్ బుక్ లెట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, అధికారులు

బుడగ జంగాలకు న్యాయం చేయాలని వినతి

కర్నూలు అర్బన్: న్యూ ఢిల్లీ రిజిష్టర్ జనరల్ ఆఫ్ ఇండియాలో పెండింగ్‌లో ఉన్న వాటిని న్యాయం జరిగే విధంగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని బేడ, బుడగ జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ కోరారు. సోమవారం నగరంలో మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేడ, బుడగ, సంగం కులమును షెడ్యూల్ కూలాల్లో ప్రాంతీయ వ్యత్యాసాల ద్వారా తొలగించిన వాటిని తిరిగి చేర్చాలని అసెంబ్లీ క్యాబినెట్ తీర్మానం చేసి పంపామన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా కేంద్రానికి నివేదిక పంపిన వాటిని రిజిష్టర్ జనరల్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంచారని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు ధూపం మాధవరావు, సిరి వాటి గిరిధర్, బైలుపాటి పెద్ద చింతలయ్య పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప
- కాంట్రాక్టు కార్మిక సంఘాల ప్రదర్శన, ధర్నా

కర్నూలు న్యూసిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500 కార్మికులకు విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కార్మికుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు మాట్లాడుతూ గత నెల 20 నుంచి విశాఖ ఉక్కు కార్మికులు చేస్తున్న సమ్మెను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగ్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయించామని వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. తొలగించిన కార్మికులకు విధులలోకి తీసుకోవాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు భాస్కర్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీఐటీయూ నగర కార్యదర్శి సాయి బాబా పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మునెప్ప

గర్భిణుల కోసం టిఫా స్కాన్

జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు



టిఫా స్కాన్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ నుంచి గైనకాలజీ విభాగంలోని ఫ్యామిలీ ప్లానింగ్ ఓపీలో నూతనంగా గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన టిఫా స్కాన్‌ను కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ గతంలో న్యూడయో గ్నస్టిక్ బ్లాక్‌కు గర్భిణులు స్కానింగ్ కోసం వెళ్లేవారని, వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఫ్యామిలీ ప్లానింగ్ ఓపీ కేంద్రంలో టిఫా స్కానింగ్‌ను కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. టిఫా స్కాన్ అనేది గర్భిణులకు గర్భంలోని శిశువు ఎదుగుదలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం మాతా శిశు సంక్షేమానికి ఎన లేని ప్రాధాన్యం ఇస్తుందని, తల్లిబిడ్డల ఆరోగ్యమే లక్ష్యంగా తీసుకుం టున్న చర్యల్లో భాగంగా గర్భిణులకు ఓపీ దగ్గరే టిఫా స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. టిఫా స్కానింగ్ అందుబాటులో తీసుకుని వచ్చినందుకు రేడియాలజీ, గైనిక్ హెచ్‌వో డీలు డాక్టర్ రాధారాణి, డాక్టర్ శ్రీలక్ష్మిలను సూపరింటెండెంట్ అభినం దించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, హస్పిటల్ అడ్మినిస్ట్రేటరు డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు డి.రఘునాథ్ అన్నారు. సోమవారం కర్నూలు పట్టణంలో కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని కలిసి పూలమాలలతో సన్మానించారు. అనంతరం తిరుపతి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. రఘునాథ్ మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అక్కలదేవి గిడ్డయ్య, వెంకట్రాముడు పాల్గొన్నారు.

యువతకు జీవన నైపుణ్యాలు అవసరం



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తదితరులు

కర్నూలు కల్చరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో యువత రాణించేందుకు వ్యక్తిగత, జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు జోన్స్ ప్రతినిధి, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ కంప్యూటర్ కోర్సుల్లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. సోమవా రం శిక్షణ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి యువత ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటూ టైం మేనేజ్ మెంట్, టీమ్ వర్క్, కమ్యూని కేషన్ స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉండా లన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు కేడీ జే బాబు మాట్లాడుతూ విద్యతో పాటు జీవన నైపుణ్యాలపై శిక్షణ పొందినవారు ఉద్యోగ సాధనలో సులు వుగా విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం ప్రయత్నం

- పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది వైఫల్యాల నుంచి ప్రజలను మభ్యపెట్టడానికే సీఎం చంద్రబాబు అండ్- కో ప్రయత్నిస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో నంద్యాల వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమ ర్శించారు. ఈనెల 6న జగన్ మీడియాలో సీనియర్ జర్నలిస్టు కృష్ణం రాజు వ్యాఖ్యలను కొమ్మినేని శ్రీనివాసరావు వారించారని, ఈ అంశాన్ని వైసీపీకి జగన్‌కు ముడిపెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తల అకృత్యాలు, మహిళలు, బాలికలకు భద్రత కరువు, ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ తాపత్రయ పడుతున్నారని ఆరోపించారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలి

కర్నూలు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. సోమవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

యోగాతో ఆరోగ్యం

ఓర్వకల్లు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని ఓర్వకల్లు గుట్టపాడు, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, హుశేనాపురం, సోమయాజులపల్లె, శకునాల తది తర గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. గుట్టపాడు గ్రామంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి, ఓర్వకల్లులో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

కర్నూలు స్పోర్ట్స్: ఆధునిక జీవితంలో యోగ సాధన అంతర్భాగం అయినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ యోగా హాలులో యోగాంధ్రలో భాగంగా జిల్లా స్థాయి యోగా పోటీలను వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. సెట్కూరు సీఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి మాటాడుతూ యోగాంధ్రలో భాగంగా వివిధ ఏజ్ గ్రూపు లకు సంబంధించి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి పోటీలకు చీఫ్ జడ్జిగా రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి వ్యవహరించారు. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, న్యాయ నిర్ణేతలుగా డాక్టర్లు ఎస్.ముంతాజ్ బేగం, పద్మావతి, పావనీలు వ్యవహరించారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో యోగాంధ్రపై మండలస్థాయి అధికారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాణెమ్మ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో పంచాయతీ, రెవెన్యూ అధికారులు, గ్రామస్థులకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఏవో మల్లేష్‌కుమార్, పీఆర్ ఏఈ వెంకటప్రకాశ్ పాల్గొన్నారు.



గుట్టపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అధికారులు, గ్రామస్థులు



కర్నూలులో మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో వేణుగోపాల్

వసతి గృహాన్ని పునఃప్రారంభించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి

కోడుమూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మూసివేసిన బీసీ బాలుర ప్రీమెట్రిక్ వసతి గృహాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సిద్ధు, హరి, నాగేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయం: ఎస్టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, కార్యదర్శి జనార్దన్ అన్నారు. సోమవారం స్థానిక సలాంఖాన్ భవన్‌లో ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేరివిజన్ కమిషన్ ఏర్పాటు, అప్రెంటిషిప్ రద్దు, తెలుగులో వంటి ఎన్నో సౌకర్యాలు ఎస్టీయూ పోరాటం ఫలితంగా వచ్చాయన్నారు. అనంతరం పట్టణ నిరాశ్రయ వసతి గృహంలో వృద్ధులకు వారు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు టీకే జనార్దన్, సుధీర్ దేవదాస్, శ్రీధర్ నారాయణ, గోవింద నాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఏవో బదిలీ

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న విజయలక్ష్మిని అనంతపురానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎం నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయలక్ష్మిపై అనేక అవినీతి ఆరోపణలున్నాయి. ఆమెను ఇటీవల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసిదేవి విచారించారు. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద విజయలక్ష్మిని అనంతపురం ఎస్సీ కార్పొరేషన్ ఆఫీసుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురండి : ఎమ్మెల్యే

కర్నూలు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. రాష్ట్ర స్థాయిలో టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపాడు రోడ్డులోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభకు కోడుమూరు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చదువులో మంచి మార్కులు సాధించిన విద్యార్థికి తన వంతుగా రూ.20వేలు అందజేశారు. అనంతరం విద్యాశాఖ కేటాయించిన ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య, డీఈవో శామ్యూల్ పాల్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అవార్డు

సి.బెళగల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ పద్మావతి, ధనుంజయుడుల కుమార్తె సింధు పదో తరగతిలో 583 సాధించడంతో షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైంది. కర్నూలులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థిని సింధుకు అవార్డు అందజేశారు.

నిధులు మంజూరు చేయాలి

కల్లూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కల్లూరు కృష్ణానగర్ ఖబరస్తాన్ డెవలప్ మెంట్ సొసైటీ సభ్యులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 26వ వార్డు సమీపంలోని కృష్ణానగర్ హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో గల ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దాదాపు పది వార్డుల ముస్లింలకు ఉన్న ఏకైక శ్మశాన వాటికలో ప్రహరీ, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని మత పెద్దలు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాణ్యం ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఎస్.ఫిరోజ్, ఖాజామియా, సులేమాన్, షేర్‌ఖాన్, సుకుర్‌బాషా పాల్గొన్నారు.

హామీలకే పరిమితమైన పొగాకు కొనుగోళ్లు

- పొగాకు కంపెనీ ఆఫీసు ఎదుట రైతుల ధర్నా

కర్నూలు రూరల్ జూన్ 9(ఆంధ్రజ్యోతి): మూడు నెలల నుంచి పొగాకు కొనుగోలు చేస్తామని కంపెనీదారులు చెబుతున్న మాటలు హామీలకే పరిమితమయ్యాయని పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగర శివారులోని గార్గేయ పురం చెరువు సమీపంలో ఉన్న జీపీఐ, ఐటీసీ, వీఎస్‌టీ, బొమ్మిడి పొగాకు కంపెనీ కార్యాలయాల ఎదుట సోమవారం ఉల్చాల, రేమట గ్రామాల రైతులు వారు పండించిన పొగాకును చేత పట్టుకొని ధర్నా చేశారు. ఈసందర్భంగా రైతులు లక్ష్మన్న, రాముడు, బజారన్న మాట్లాడుతూ సిరి కంపెనీ ఒప్పందంతో ఉల్చాలలో దాదాపు వంద ఎకరాల్లో సిరి పొగాకు పంట పండించామన్నారు. నెలల నుంచి పొగాకు కంపెనీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టరేట్‌లో జరుగు తున్న స్పందన కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికా రులకు రైతులు వినతిపత్రం సమర్పించారు. ఈధర్నాలో రైతులు బుర్రపెద్దకర్రెన్న, చిన్నమాధన్న, లక్ష్మన్న, రంగస్వామి, లక్ష్మన్న పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉల్చాల రైతులు

ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

కోడుమూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే స్కిల్ డెవలప్‌మెంటు లక్ష్యమని జిల్లా స్కిల్ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ అన్నారు. స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో సోమ వారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమానికి నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. ఇందులో 10 ప్రైవేటు కంపెనీల ప్రతి నిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో దాదాపు 150 మంది పాల్గొనగా 64 మందికి వివిధ కంపెనీలల్లో ఉద్యోగాలు సంపాదించారు. కళాశాల యాజమాన్యం గోట్ల శేఖర్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, జిల్లా స్కిల్ కోఆర్డినేటర్లు వీరేష్, సాయితేజ పాల్గొన్నారు.



మండలంలోని పల్లెదొడ్డి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షపు నీటిని రైతులు తమ పొలాల్లోకి అనుమతించడం లేదు. నీరంతా రహదారిపైనే నిలిచింది. అధికారులు స్పందించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు. ● దేవనకొండ

ఎప్పుడు కూలుతుందో?



మండలంలోని చెన్నంపల్లి ప్రధాన రహదారి పక్కన విద్యుత్ స్తంభం విరిగిపోయి స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. గాలి, వానకు స్తంభం కూలితే విద్యుత్ తీగలు ఇళ్లమీద పడి పెను ప్రమాదం సంభవిస్తుందని భయపడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని కోరుతున్నారు. ● తుగ్గలి

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు

పత్తికొండ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విక్టర్ సామేల్ సూచించారు. సోమవారం మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గతంలో ఆన్‌లైన్ చేసుకోలేని విద్యార్థులతో పాటు 7,8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు విద్యాశాఖ కమిషనర్ అవకాశం ఇచ్చారన్నారు. 20వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల గుర్తింపు సర్వే పూర్తి

ఆలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పీడీ ఆదేశాల మేరకు దివ్యాంగుల సర్వే పూర్తి చేసినట్లు భవిత భవన్ ఉపాధ్యాయుడు రాందాసు సోమవారం తెలిపారు. 14 సంవత్సరాల్లోపు విద్యార్థుల ంతా ఉచిత నిర్బంధ విద్యను పొందాలన్న ఉద్దేశంతో దివ్యాంగులు బడిబయట ఉండకూడదని సర్వే నిర్వహించామన్నారు. 18 సంవత్సరాల్లోపు దివ్యాంగుల వివరాలు సేకరించి పాఠశాలలో చేర్పిస్తామన్నారు. ప్రీ ప్రైమరీలో 16 మందిని, పాఠశాలలో చేరే వారిని 11 మందిని గుర్తించామన్నారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, తీవ్ర వైకల్యం ఉన్న పిల్లలకు ఇంటివద్దే విద్యఅందించేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు యుడైస్‌లో నమోదు చేయించి అనంతరం భవిత కేంద్రంలో తర్ఫీదు ఇస్తామని తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న భవిత భవన్ ఉపాధ్యాయుడు రాందాసు

'విషం కక్కుతున్న వైసీపీ మీడియా'


సీఐకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళ నాయకులు

పత్తికొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ వైసీపీ మీడియా సాక్షి చానల్‌లో విషం కక్కుతున్నారని తెలుగు మహిళా నాయకురాలు వీరమ్మ, కవిత ఆరోపించారు. అమరావతి మహిళలపై సాక్షి డిబేట్‌లో జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన అభ్యంతర వ్యాఖ్యలను వారు ఖండించారు. ఎడిటర్ కొమ్మినేని శ్రీనివాసరావు నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణంరాజు మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. వీరిపై కేసు నమోదు చేయాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌కు ఫిర్యాదుచేశారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి

దేవనకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విత్తన శుద్ధి చేసిన అనంతరం విత్తితేనే అధిక దిగుబడి సాధ్యమని కేవీకే శాస్త్రవేత్త నిరంజన్‌రెడ్డి సూచించారు. మండలంలోని కరివేములలో రైతు సేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ లో భాగంగా రైతులతో సమా వేశం నిర్వహించారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో, అధిక దిగుబడి సాధ్యమన్నారు. వర్షాకాలంలో పశువులు, జీవాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంటలను వివరించారు. సమావేశంలో ఆత్మ బీటీఎం మారుతి యశ్వంత్, ఆర్ భార్గవి, వీఏవోలు రంగన్న, అబ్దుల్ సలాం, వీఏఏ రంగస్వామి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి


పత్తికొండలో ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

పత్తికొండ టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహెబ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పంటల బీమా వర్తింపజేసి అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. రామాంజనేయులు, సుంకన్న, శ్రీనివాసులు, నరసింహులు, హనుమంతు, నాగేంద్ర పాల్గొన్నారు.

పెట్టుబడి మేరకు రుణాలు ఇవ్వాలి

దేవనకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుకు అయ్యే పెట్టుబడి మేరకు బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వాలని రైతుసంఘం అధ్యక్షుడు కండప్ప, సీపీఐ నాయకుడు శేఖర్ కోరారు. షరతులు లేని రుణం ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయాలని తహసీల్దార్ ప్రసాదురాజుకి వినతిపత్రం అందజేశారు. నాయకులు ప్రసాద్, కృష్ణ, రఫీ, తదితరులు ఉన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కౌలు కార్డులు ఇవ్వాలి

ఆదోని రూరల్, జూన్ 9 ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర కోరారు. సోమవారం రైతులతో కలిసి తహసీల్దార్ శివరాముడుకు వినతి పత్రం సమర్పించారు. టీడీపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు జమచే యాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. నాణ్యమైన సబ్సిడీ విత్తనాలను అందిం చాలన్నారు. లక్ష్మీరెడ్డి, బసాపురం గోపాల్, హనుమంతు, బసప్ప పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఆలంకొండ నబి


చైర్మన్, డైరెక్టర్లతో ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఆలంకొండ నబిసాహెబ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సమక్షంలో చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌గా మురసాని నాగేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ మార్కెట్‌యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. డైరెక్టర్లుగా బోయ లక్ష్మీదేవి, వెంకటరంగయ్య, బుల్లినేని రంగయ్య, ఎం దేవేంద్రప్ప, గోవర్ధన్‌నాయుడు, జెగ్గిలి రజిని, బోయ జయ మ్మ, ఆర్ లక్ష్మీదేవి, రమావత్ లక్ష్మీదేవి, వడ్డె సుశీలమ్మ, గల్లా రామచంద్ర, కుందురు రమేశ్, ఎస్కే మహబు బ్‌బాషా మొదటి తీర్మానంలో సంతకాలు చేశారు. తుగ్గలి నాగేంద్ర, మర్రి శ్రీరాములు, మార్కెట్ యార్డు సెక్రటరీ కార్నలిస్, సిబ్బంది ఉన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి


అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం కార్యాలయంలో మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించాలని సూచించారు.

స్వర్ణాంధ్ర విజన్ ఆవిష్కరణ

ఆదోని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యాక్షన్ ప్లాన్ కార్యాలయాల ఏర్పాటుతో స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి శ్రీకారం చుట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం సచివాలయం నుంచి యూనిట్ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యాల యాల ఏర్పాటుతో స్వర్ణాంధ్ర-2047 సాకారానికి శ్రీకారం చుట్టామన్నారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, కమిషనర్ కృష్ణ, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమీక్ష

ఆదోని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం రాత్రి 2025 ఓటరు జాబితపై రాజకీయ నాయకులు, అధికారులతో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమీక్ష నిర్వహించారు. ఆదోని నియోజకవర్గం ఓటరు జాబితా, నూతన ఓటర్ నమోదు పారం, 6,7,8 వివరాలను సేకరిస్తామన్నారు. తహసీల్దార్ శివరాముడు, ఎన్నికల ఉప తహశీల్దార్ గాయత్రి పాల్గొన్నారు.

శ్రద్ధపెడితే రాణించొచ్చు

మద్దికెర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై శ్రద్ధపెడితే రాణిస్తారని విద్యాసాయి పాఠశాల కరస్పాండెంట్ యజ్ఞం వెంకట మాధవ, ప్రిన్సిపాల్ బాల సునీత అన్నారు. సోమవారం పాఠశాల విద్యార్థులు పారా సతీష్, నందిని, ప్రవీణ్ కుమార్‌కు కర్నూలులో మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జేసీ డా.బి.నవ్య, డీఈవో శామ్యూల్ పాల్ ప్రశంసా పత్రాలు ఇచ్చారన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే ధ్యేయం

తుగ్గలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చడమే ధ్యేయమని సర్పంచ్ విజయలక్ష్మి, సలహాదారుడు మధుబాబు అన్నారు. సోమవారం మండలంలోని గిరిగిట్లలో ఇంటింటికి కొళాయి వేసేందుకు పైపులైన్ పనులు ప్రారంభించారు. తెలుగు యువత అధ్యక్షుడు సత్య ప్రకాష్, బలరాముడు, మల్లికార్జున, రంగస్వామి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

హొళగుంద, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ఎమ్ఎస్ సందేశ్, సింగం ప్రవల్లిక, బీఎమ్ ఫాతిమాకు డీఈవో, జేసీ ప్రశంసాపత్రాలు అందజేశారు. సోమవారం కర్నూలులో రూ. 20వేల చెక్కును అందజేసినట్లు పాఠశాల హెచ్ఎమ్ కబీర్ సాబ్ తెలిపారు.

రైతులందరికీ విత్తనాలు ఇస్తాం

తుగ్గలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు ఇస్తామని ట్రైబల్ సలహా మండలి మెంబర్ వెంకటపతి, టీడీపీ కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. సోమవారం చెన్నంపల్లి, అమీనా బాద్‌లో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. వేరుశనగ, కంది, కొర్ర, మినుములు, జొన్నలు, సజ్జలు సబ్సిడీ కింద వచ్చాయని, రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రైతులు విత్తనశుద్ధి, చపంట మార్పిడి పాటించాలన్నారు. ఎంపీఈవో మహేష్, పత్తికొండ మార్కెట్ యార్డు డైరెక్టర్ మాబాషా, లక్ష్మీనారాయణ చౌదరి, కొమ్మె వెంకటేశ్, అక్బర్ బాషా, కోటేష్‌గౌడు, రామయ్య, మధుబాబు, సత్యప్రకాష్, హాశేన్, డీలర్ శీనప్ప, తదితరులు ఉన్నారు.


చెన్నంపల్లిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

నాణ్యమైన విత్తనాలివ్వాలి

వెల్దుర్తి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను 90 శాతం సబ్సీడీతో ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు వినతి పత్రం అందజేశారు. చిన్నమాదులు, శివ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో వసతులు కల్పించాలి

వెల్దుర్తి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో వసతులు కల్పించాలని సీపీఐ కార్యదర్శి క్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం రైల్వేస్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, పయాణికులు కూర్చోనేందుకు బెంచీలు, షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దేవనకొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-బళ్లారి రహదారిలో కరివేముల వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి గాయపడ్డాడు. వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ రంగన్న చేరుకొని బాధితుడిని 108లో కర్నూలు వైద్యశాలకు తరలించారు

మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా దేవేంద్ర



మద్దికెర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా మదనంతపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దేవేంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శ్యాంబాబు, టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైతులకు సహకరిస్తానని తెలిపారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ఆదోని రూరల్, జూన్ 9 ఆంధ్రజ్యోతి): మండలంలోని అలసందగుత్తి గ్రామంలో ఈ నెల 10వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాముడు, నాగరాజు, మహేష్ తెలిపారు. ఏరువాక సందర్భంగా పోటీలు ఉంపటాయని రూ.500లు చెల్లించి, పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతిని టీడీపీ నాయకుడు మారుతి నాయుడు రూ.15వేలు, రెండో బహుమతిని వెంకటేష్ రూ.8వేలు, మూడో బహుమతిని ధణాపురం రాజు రూ.5వేలు, నాల్గవ బహుమతి పింజరి ఈరన్న రూ.3వేలు ఇస్తారన్నారు. వివరాలకు 9346787883, 8309261412, 8501031919 నంబర్లను సంప్రదించాలన్నారు.

యోగాతో ఉపయోగం

హాలహర్వి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఉపయోగం ఉందని యోగా చేయడాన్ని అలవరచుకోవాలని ఎంపీడీవో వరలక్ష్మి సూచించారు. సోమవారం హాలహర్విలో ర్యాలీ నిర్వహించారు. ఉదయం లేవగానే యోగా చేయడానికి సమయం కేటాయించాలని ఆమె కోరారు.

తుగ్గలి: రోజూ యోగా చేసి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ట్రైబల్ సలహా మండలి సభ్యుడు వెంకటపతి సూచించారు. సోమవారం చెన్నంపల్లిలో యోగా ర్యాలీ నిర్వహించారు. కార్యదర్శి కార్తిక్ రంగనాథ్, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్, పత్తికొండ మార్కెట్ యార్డు డైరెక్టర్ మాబాషా, రాజేంద్రగౌడ్ పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: యోగాతో ఆరోగ్యం వస్తుందని ఎంపీడీవో మోహన్ కుమార్ అన్నారు. సోమవారం క్రిష్ణగిరిలో ర్యాలీ నిర్వహించారు. ఈవోఆర్డీ లచ్చప్ప, సీనియర్ అసిస్టెంట్ రామస్వామి ఉన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

తుగ్గలి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్త పూజారి సుంకన్నకు ఆపార్టీ నాయకులు రాజేంద్రగౌడు, జయచంద్రగౌడు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. సుంకన్న భార్య దివ్యాంగురాలు కావడంతో కుటుంబ పోషణ నిమిత్తం అందజేశమన్నారు. ఇదుకు సుంకన్న వీరికి కృతజ్ఞతలు తెలిపారు. లక్ష్మీనారాయణ చౌదరి, తిమ్మప్ప, హాశేనీ, సావాసప్ప, ఉరుకుందు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆవిర్భావ వేడుకలు


ఎస్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): ఎస్టీయూ 79వ ఆవిర్భావ వేడుకలను సోమవారం పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముందుగా సీనియర్ నాయకుడు నాగరాజు జెండాను ఆవిష్కరించారు. ఆత్మాభిమానమే నినాదంగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ముగ్దుమ్ మోహిద్దీన్ ఆధ్వర్యంలో 9 జూన్ 1947న ఎస్టీయూ ఆవిర్భవించిందన్నారు. విద్యార్థి భవితకు పాటు పడుతూ ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తుందన్నారు. పీఆర్‌సీ సాధన, అప్రెంటిస్ నుంచి విముక్తి కల్పించిందన్నారు. ప్రహ్లాద, రమేష్ నాయుడు, వీర చంద్ర యాదవ్, భీమరాజు, రాజా సతీష్, ప్రసాద్, రామయ్య, నాగేష్, రాముడు జై రాముడు, నిరంజన్ రెడ్డి, శ్రీరాములు, నాగేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

ఆలూరు: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ నిరంతర పోరాటం చేస్తుందని రాష్ట్ర నాయకుడు నాగరాజు అన్నారు. ఆలూరు ఎంఈవో కార్యాలయం వద్ద ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంఈవో కోమలాదేవి జెండా ఎగురవేశారు. తిమ్మప్ప, గిరయ్య, ఉరుకుందప్ప, గోవిందప్ప, సుధాకర్, రవిశంకర్, కాలప్ప, సురేష్, రామకృష్ణ, నాగరాజు, మురళీధర్, సూర్యనారాయణ, వీరేష్, సద్గురుడు, మధుసూదన్ పాల్గొన్నారు.

సంప్రదాయ పంటల సాగుతో అభివృద్ధి


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

చిప్పగిరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటల సాగుతోనే రైతులు అభివృద్ధి చెందగలరని శాస్త్రవేత్తలు చందన, సుజాత, మౌనిక, ఏవో జయలక్ష్మి సూచించారు. సోమవారం చిప్పగిరి మండలం, ఏరూరు వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా కర్నూలు ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డా.పి.సుజాతమ్మ వరి, జొన్న సాగులో యాజ మాన్య పద్దతులపై మాట్లాడారు. చిప్పగిరి ఏవో జయలక్ష్మి ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ విషయాలను తెలిపారు. కేవీ శాస్త్రవేత్త డా. వై.మౌనిక, మిరప, ఉల్లి పత్తి యాజమాన్య పద్దతులు తెలియజేశారు. చందన మాట్లాడుతూ కేవీకే బనవాసిలో రైతులకు అధిక దిగుబడి ఇచ్చే కంది, కొర్ర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం రైతులకు కంది, శనగ, పత్తి, సాయిల్ శాంపిల్ కలెక్షన్ సాహిత్యాన్ని పంపిణీ చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వీరభద్రగౌడ్, హౌసింగ్ పీడీ చిరంజీవి


వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే శ్యాంబాబు, ఆర్డీవో భరత్‌నాయక్

టీడీపీతోనే స్వర్ణాంధ్ర

ఆలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. సోమవారం సచివాలయం-2లో స్వర్ణాంధ్ర విజన్ 2047 యాక్షన్ ప్లాన్‌పై హౌసింగ్ పీడీ చిరంజీవి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికై అహర్నిశలు పాటుపడుతున్నారన్నారని, భవిష్యత్ ప్రణాళికలో భాగంగా స్వర్ణాంధ్ర విజన్-2047 రూపొందించారన్నారు. ఈ యాక్షన్ ప్లాన్ ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి అడుగులు పడతాయన్నారు. ఎంపీడీవో మద్దిలేటిస్వామి, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌రావు ఉన్నారు.

పత్తికొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు విజన్ 2047 యూనిట్ కార్యాలయాలు వర్చువల్‌గా ప్రారంభిచారు. పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పత్తికొండ నుంచి ఎమ్మెల్యే శ్యాంబాబు, ఆర్డీవో భరత్‌నాయక్ తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆదోని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు రక్షణ కల్పించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు న్యాయవాది గురురాజుపై దాడిని నిరసిస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రభుత్వాలు మారిన న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కలిసి వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవన్ సింగ్, న్యాయవాదులు సునీత రెడ్డి, అనితా బాయి, సబ్రహ్మణ్యం శర్మ, వెంకటేష్, నాసిర్, మధు, సాయికుమార్, కళ్యాణ్ రెడ్డి, ఇంతియాజ్ అహ్మద్, మనోజ్, తరుణ్, నరసింహ యాదవ్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

రైళ్లను పునరుద్ధరించాలి

ఆదోని రూరల్, జూన్ 9 ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దుచేసిన రైళ్లను పునరుద్ధరించాలని సీపీఐ నాయకులు అజయ్ బాబు, సుదర్శన్, కల్లుబావి రాజులు కోరారు. సోమవారం పట్టణంలో ర్యాలీ, రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆదోనిలో డబల్ ఇంజన్ సర్కార్ ఉన్నా రైల్వేస్టేషన్ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందన్నారు. ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు రోజు వేల సంఖ్యలో పయా ణిస్తారని, రైళ్ల సరిపోక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న కోరారు. సోమ వారం కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిసున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కార్మికుల సంఖ్య పెంచి, పనిఒత్తిడిని తగ్గించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. గోపాల్, తిప్పన్న , లక్ష్మణ ఇంజనీరింగ్ కార్మికులు మహమ్మద్, పీరా, దేవేంద్ర, కైలాస్, శివ పాల్గొన్నారు.

టీడీపీతోనే సామాజిక న్యాయం

పార్టీ కోసం కష్టపడ్డవారందరికీ పదవులు: ఎమ్మెల్యే బీవీ ● అట్టహాసంగా నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం ● సామాజిక న్యాయం పాటించడం అభినందనీయం: తిక్కారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


ప్రమాణస్వీకారోత్సవానికి హాజరైన నాయకులు


కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకుంటున్న మల్లయ్య

ఎమ్మిగనూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయంతో ముందుకు సాగుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పార్టీ కోసం పనిచేసిన ప్రతిఒక్కరికి పదవులు ఇస్తున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సం ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. ప్రమాణ స్వీకారోత్సవానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, కురువ, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్లు దేవేంద్రప్ప, బోజమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి హాజరైయ్యారు. చైర్మన్‌గా పెద్దమరివీడు గ్రామానికి చెందిన కురువ మల్లయ్య, వైస్‌చైర్మన్‌గా దైవందిన్నె గ్రామానికి చెందిన బోయ అంజినితో పాటు బండారు లక్ష్మి, బోయ ప్రభాకర్, రామచంద్రమ్మ, జకతపు అబ్రహం, గుర్రం కమ్మ కవిత, ఎం దుబ్బన్న, కరణం సుధీర్, సూగూరు షాహిన్, తెలుగు శశికళ, బోయ వెంకటేశ్వరమ్మ, అచ్చుకట్ల ఫక్రుద్దీన్, కొండే జయలక్ష్మి, కమ్మరి వెంకటేష్ ఆచారిలతో మార్కెట్ కమిటీ కార్యదర్శి పద్మావతి తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ ఎంతో నమ్మకంతో పదవులు ఇచ్చారని వారి నమ్మకాన్ని నిలబెట్టేలా మార్కెట్ అభివృద్ధికి కృషిచేసి మంచి పేరుతెచ్చుకోవాలన్నారు. మార్కెట్ చైర్మన్, డైరెక్టర్ల ఎంపిక అందరి ఆమోదంతోను, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో జరిగిందన్నారు. చెర్మన్‌గా ఎంపికైన కురువ మల్లయ్య అమాయకుడేమీ కాదని మాట్లాడేందుకు రాకపోవచ్చుకాని చేతల్లో తన పనిచూపుతారన్నారు. పదవులకు ఎంపికైన వారు ఎన్నికల సమయంలో పార్టీకోసం పనిచేసి వారిగ్రామల్లో మంచి మెజార్టీ తీసుకొచ్చారన్నారు. అంతేగాక నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు పార్టీ గెలుపుకోసం ఎంతో శ్రమించారని వారందరికి పదవులు వస్తాయని బరోసా ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో సీఎం ఆదేశాలతో పదవులు రాబోతున్నాయని తెలిపారు. అంతకు ముందు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ కురువ సామాజిక వర్గానికి చెందిన రైతు మల్లయ్యను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేయటం శుభపరిణామమన్నారు. తెలుగుదేశం పార్టీలో పదవులు కొందరికే కాదని అందరికి సొంతమని ఎమ్మెల్యే బీవీ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నిరూపించారన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎంపికలో సామాజిక న్యాయం పాటించి అన్నివర్గాల వారిని డైరెక్టర్లుగా ఎంపిక చేయటం అభినందనీయమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క టీచర్‌పోస్టుగాని, పోలీసు, అటెండర్ పోస్టుగాని భర్తీ చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ వదిలారన్నారు. ఉద్యోగాల భర్తికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎప్పుడైతే సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశారో నాటినుంచి వర్షాలే.. వర్షాలన్నారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత మాది అని అన్నారు. పార్టీకోసం పనిచేసిన వారందరికి పదవులు వస్తాయని, ఎవరి మాటవినోద్దన్నారు. నియోజకర్గంలో ప్రతిఒక్కరు బీవీ జయనాగేశ్వర రెడ్డిని నమ్ముకొని పనిచేయాలని, మరోసారి ఎమ్మెల్యేగాను, మీ దయతో మంత్రిగా ఎదిగేందుకు కృషిచేయాలన్నారు.

అలాగే జనసేన, బీజేపీ నాయకులు రేఖాగౌడ్, నరసింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు సముచిత న్యాయం జరుగుతోందన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం అభివృద్ధి బీవీ జయనాగేశ్వరరెడ్డితోనే సాధ్యమన్నారు. అలాగే మాన్వి దేవేంద్రప్ప, బొజమ్మ, నాగేశ్వర యాదవ్, రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తరువాతే బీసీలు రాజకీయంగా ఎదిగారన్నారు. నేడు చంద్రబాబు హాయంలో ఎన్నో పదవులకు ఎంపిక అవుతున్నారని తెలిపారు. ప్రమాణస్వీకారోత్సవానికి హాజరైన నాయకులు కమ్మడి కండువాలు కప్పుకొని హజరుకావటం అందరి దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, కడిమెట్ల చెన్నారెడ్డి, కౌన్సిలర్ రామదాసు గౌడ్, భాస్కర్, ఆల్‌ఫ్రెడ్ రాజు, గోపాల్, హనుమంతు, మద్దిలేటి, రామకృష్ణ, కర్రెన్న, వీరేష్, షాలేమ్, మల్లికార్జున, మురళి, వెంకటేష్, వెంకటరెడ్డి, బందేగురుస్వామి, సురేష్ చౌదరి ఆయా గ్రామాల రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ పనులు చేసిన నగదు వేరే ఖాతాలోకి..


సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బసలదొడ్డి కాంట్రాక్టర్

పెద్దకడుబూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ పనులు చేసిన నగదును పీఆర్ ఏఈ మల్లయ్య బయట వ్యక్తుల ఖాతాలోకి జమ చేశారని బసలదొడ్డి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ శివరాముడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆదోనిలోని పీజీఆర్ఎస్‌లోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని యంజీఎన్ఆర్‌జీఈఎస్ పథకం కింద రూ. 22.52 లక్షల విలువ చేసే పనులు చేశానన్నారు. అందులో రూ 11 లక్షల నగదు తన ఖాతాలోకి జమ చేసి, మిగిలిన నగదు తమ ఖాతాలోకి జమ చేయాలని చాలాసార్లు కార్యాలయాలా చుట్టు తిరిగినా వారు ఏ డబ్బులు పెండింగ్‌లో లేవు అంటున్నారన్నారు. తను చేసిన పనులకు మిగిలిన నగదు చెల్లించేలా చేయాలన్నారు. అంతేకాకుండా పీఆర్ ఏఈ మల్లయ్య పై చట్టపరమైన, శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీకి రాజీనామా

● మాజీ మార్కెట్ యార్డు చైర్మన్


మాట్లాడుతున్న దేశాయ్

నందవరం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్, నియెజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దేశాయ్ మాధవరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అధికారంలో లేనప్పుడు, అధికారంలో ఉన్నప్పుడు కష్టపడి పని చేసిన వారికి పార్టీలో గుర్తింపు లేదని కేవలం ధన బలం ఉన్నవారికి మాత్రమే పార్టీలో నామినేటెడ్ పదవులు దక్కుతున్నాయన్నారు. ఇక్కడ టీడీపీకి విలువ లేదు. నియోజక వర్గంలో మిగిలిన విషయాలన్ని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు తెలుసన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో వారే అధికారం చలాయించడం బాధకరంగా ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి తనకు పార్టీ నాపై నమ్మకంతో ఇచ్చిన జిల్లా ఉపాధ్యక్షుడి పదవి, ఎమ్మిగనూరు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్లు , జిల్లా అధిష్టానానికి, రాష్ట్ర కార్యాలయానికి తన రాజీనామా పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

మంత్రాలయం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత కాలంలో వర్షం ప్రారంభంలో గ్రామంలో అంటువ్యాధులు సోకకుండా పరిశుభ్రతపై దృష్టి సారించి శుభ్రంగా ఉంచుకోవాలని, నిర్లక్ష్యం వహించే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నూర్జహాన్, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్య, ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో అధికంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సంబంధిత కార్యదర్శులు గ్రామంలోనే ఉంటూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బీసీలకు సముచిత స్థానం టీడీపీలోనే సాధ్యమని కర్నూలు పార్లమెంట్ కురువ సాధికారిక సమితి మెంబర్ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు సోగనూరు జగదీష్ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని బీసీ కులానికి చెందిన మల్లయ్యకు ఇవ్వడం అభినందనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్ని కులాలకు న్యాయం చేస్తూ అందరికీ పదవులు ఇస్తు సముచిత న్యాయం చేస్తున్నారని, నియోజకవర్గంలోని బీసీలు ఎమ్మెల్యే వెన్నంటే ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం


ఎస్టీయూ జెండాకు వందనం చేస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో అడివన్న అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు జెండా ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ 78 ఏళ్ల ఉద్యమ చరిత్ర కలిగి అనేక ఆందోళనల ఫలితమే నేడు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న ఫలాలు అని అన్నారు కార్యక్రమంలో నాగరాజు, ప్రసన్నరాజు, రాష్ట్ర కౌన్సిలర్ బాబయ్య, యల్లప్ప, నాగభూషణం, తిమ్మప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు నినాదాలు చేసుకుంటూ అనంతరం మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషాఫణి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బంగారమ్మ, మెప్మా సిబ్బంది ,సచివాలయ సిబ్బంది, యోగా టీచర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీవిద్య, టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని అన్ని శాఖల అధికారుల ఆధ్వర్యంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా కోసం గంట సమయం కేటాయిస్తే మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు యోగా సాధనలో భాగస్వామ్యం కావలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభావతి, ఈవోపీఆర్‌డీ జయరాముడు, బీజేపీ నాయకులు పురుషోత్తం గౌడ్, జనసేన నాయకులు గణేష్, టీడీపీ నాయకులు మల్లికార్జున, వైసీపీ మండల కన్వీనర్ రాం మోహన్ రెడ్డి, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుడదంటూ ఆటో డ్రైవర్లకు ఎస్సై మధుసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం కమిటీ రోడ్డులోని ఆటోలను, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. ఎల్ఈడీ బల్బులు పెట్టుకొని నడిపే వాహనాలను నిలిపి వాటితో జరిగే నష్టం గురించి వివరించి వాటిని తొలగించాలని తెలిపారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేశారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మిలను తొలగించడం సరైంది కాదని ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు వీరేష్, తిమ్మగురుడు, రాజు, ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమలో పనిచేస్తున్న 2500 మందిని తొలగించడం దారుణమన్నారు. వెంటనే కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలను చెల్లించాలన్నారు. నిర్బంధంతో కార్మికుల సమ్మెను భగ్నం చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపేవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయేంద్ర, మహేంద్రబాబు, దాదావలి, షమీఉల్లా, మల్లికార్జునగౌడు, సుంకన్న, నరసింహులు, యేసోబు, నాగరాజు, కిరణ్, నరసన్నలు పాల్గొన్నారు.

'శ్మశాన స్థలాన్ని బీసీలకే కేటాయించాలి'

మంత్రాలయం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో బీసీలు అంత్యక్రియలు నిర్వహిస్తున్న శ్మశాన వాటికను వదిలే ప్రసక్తే లేదని, అవసరమైతే దళితులకు ఇచ్చిన ఇంటి పట్టాలు రద్దు చేయాలని గ్రామానికి చెందిన బీసీ నాయకులు సర్పంచ్ బెస్త అంజిని, ఉప సర్పంచ్ వీరనాగుడు, ఎంపీటీసీ రామాంజనేయులు, గంగుల వెంకటేశ్, మాజీ సర్పంచ్ అల్లింగప్ప, చాపల నగేష్‌లు అన్నారు. పాదయాత్రగా భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు హనుమంతురెడ్డి, కసిరెడ్డి, ఉపేంద్ర రెడ్డి, రవికుమార్, జగదీష్, గోవర్దన్ నాయుడు, రాజశేఖర్ స్వామి, నారాయణ, గ్రామానికి చెందిన మల్లికార్జున, శివలింగప్ప, హనుమేష్, తిక్కస్వామి, కుమారస్వామి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

పెద్దకడుబూరు , జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకడోణ గ్రామంలో ఈ నెల 4వ తేదిన మాదిగ అయ్యప్పపై దాడి చేసిన అదే గ్రామంలోని మరో వర్గానికి చెందిన ఏడుగురు పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ ముందు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బాధితులపై నాలుగు రోజుల క్రితం దాడిచేస్తే ఇంత వరకు కేసు కటకపోవడం అప్రజాస్వామ్యమని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బొజ్జప్ప, యోహాన్, ఆదామ్, ప్రభాకర్, సీమోను, అనీల్, కర్ల, ఆనంద్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగింత

మంత్రాలయం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం , కోసిగి మండలాల్లో నూతనంగా బాధ్యతలు చేపడుతున్న మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులకు బోధనలో నిర్లక్ష్యం వహించకుండా మంచి ఫలితాలు సాదించేందుకు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఎంఈవో మైనుద్దీన్ సూచించారు. సోమవారం మంత్రాలయం ఎంఆర్‌సీ భవనంలో నూతనంగా మంత్రాలయం, కోసిగి మండలాలకు వచ్చిన హెచ్‌ఎంలకు ఎంఈవో ఆర్డర్ కాపీలను అందజేసి పాఠశాలల బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్మోహన్, సీఆర్‌పీలు నరసన్నగౌడు, బంగారప్ప, బీమేష్, లలిత, రాకేష్, పాల్గొన్నారు.

విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు

కోసిగి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన కోసిగిలోని మోడల్ స్కూల్‌లో చదివిన విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా సోమవారం కర్నూలులో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు వినయ్‌కుమార్ 505/600 మార్కులు, ప్రణయ్ కుమార్ రెడ్డి 546/600 మార్కులు సాదించడంతో వీరికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఈవో శామ్యూల్ పాల్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ ప్రతిభ పురస్కార అవార్డుతో పాటు రూ.20వేల నగదు, మెడల్స్, సర్టిఫికేట్లను విద్యార్థులకు అందజేశారనీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు.

గోనెగండ్ల: కర్నూలు జిల్లాలో పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక చేశారు. అందులో భాగంగా అవార్డుకు గోనెగండ్లలోని మోడల్ స్కూల్ నందు పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ కనపరచిన తెలుగు ప్రవీణ్ (549)ను షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపిక చేశారు

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు


చెక్క రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం జ్యేష్ఠ మాస త్రయోదశి శుభ దినంను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో చెక్క రథంను వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం మార్మోగింది.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి: పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో బాగంగా సోమవారం తన శిష్యబృందంతో కలసి బెంగళూరుకు బయలు దేరి వెళ్లారు. 5 రోజుల పాటు బెంగళూరు, చెన్నైలో పూజలుచేసి అక్కడి భక్తులను ఆశీర్వాదించనున్నారు. ధార్మిక పర్యటన ముగించుకొని 13వ తేదిన శుక్రవారం మంత్రాలయం కు చేరుకుంటారని మఠం ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు.

సబ్సిడీ విత్తనాలు అందించాలి

నందవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు డిమాండ్ చేశారు. సోమవారం నందవరం తహసీల్దారు కార్యాలయం ముందు దర్నా నిర్వహించి, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీ శశిశేఖర్ రావుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లోకి వస్తున్న నాసిరకం విత్తనాలను రద్దుచేసి ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామలింగడు, మలేష్ ముని, ఈరన్న పాల్గొన్నారు.

జీడీపీ కాలువ గట్లకు మరమ్మతులు


జీడీపీ కుడి కాలువ గట్లకు గోడలు కడుతున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోనెగండ్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు కుడికా లువ గట్లను జీడీపీ అధికారులు నిర్మించే పనులు ప్రారంభించడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, వాహన దారులు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం 'కుంగుతున్న కాలువ గట్లు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన జీడీపీ అధికారులు కుడికాలువ కుంగిన గట్లను మరమ్మతు చేస్తు గోడలను నిర్మిస్తున్నారు. అలాగే ప్రమాదకర మలుపు వద్ద వాహన దారులకు హెచ్చరిక బోర్డు ను కూడా ఏర్పాటు చేశారు. అధికారులు ఈ పనులు చేపట్టడంతో ఆ దారి వెంట వెళ్లే ప్రయాణికులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

34వ రోజుకు చేరిన సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు, న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 34వ రోజు సమ్మె కొనసాగించారు. మొదటగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెంకటేశులు, నరసింహులు, కేసన్న, రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్, భాషా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు సోమవారం నిర్వహించిన నియోజకవర్గం విజన్ ప్లాన్ యూనిట్-2047 కు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హాజరయ్యారు. ముందుగా విజన్ ప్లాన్ యూనిట్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029 లోపు పూర్తిచేయాల్సిన విజన్ ప్లాన్ పనులపై నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వెంకటరామిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్య, తహసీల్దార్ శేషఫణి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, నందవరం ఎంపీడీవో పుల్లయ్య, ఎమ్మిగనూరు ఎంపీడీవో బంగారమ్మ, గోనెగండ్ల ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్డీలు విజయలక్ష్మి, ఏపీఎంలు రాఘవేంద్ర, జయశ్రీలతో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం


భవనాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, డీపీవో భాస్కర్

మంత్రాలయం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థ, విద్య, వైద్యం, ఆరోగ్యం, పరిశుభ్రత, సాగు, తాగు గృహ నిర్మాణాలు, బాలికల విద్య వంటి అంశాలపై ప్రతి అధికారి సహకరించి మంత్రాలయం నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, డీపీవో భాస్కర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం పైభాగంలో స్వర్ణాంధ్ర విజన్-2047 నూతన కార్యాలయానికి ఎంపీడీవో నూర్జహాన్ ఆధ్వర్యంలో రాఘవేంద్రరెడ్డి, డీపీవో భాస్కర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు నాలుగు మండలాలు వెనుకబడి ఉన్నాయనీ, అత్యధికంగా వలసలు వెళ్తున్నారని, వాటిని గుర్తించుకుని ప్రతి శాఖలో నిక్కచ్చిగా సర్వేలు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని రాష్ట్ర మంత్రులతో మాట్లాడి మంత్రాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్య, హరికృష్ణ, రంగముని, పుష్పావతి, శాంతమ్మ, అరుణ, పంచాయతీ రాజ్ ఏఈ మల్లయ్య, ఎంపీటీసీ వెంకటేశ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొడదాం

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ, కూటమి ప్రభుత్వం విధానాలను తిప్పికొట్టాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి ఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పద్మశాలి కల్యాణమండపంలో సీపీఎం రాజకీయ శిక్షణా తరగతుల సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ పాలనలో దేశ ఆర్థిక పరిస్థితిని దెబ్బతిందన్నారు. ప్రజలు ఉపాధి కోల్పోయి, కొత్తగా ఉద్యోగాలు లేక కోనుగోలు శక్తి క్షిణించిందన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, కార్యదర్శి గోవిందు, రాముడు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గాలపై కేసు నమోదు

మంత్రాలయం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 11మందిపై కేసులు నమోదు చేసినట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. ఆదివారం వైసీపీ నియోజకవర్గ లీగల్ సెల్ చైర్మన్, ఎమ్మిగనూరు కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కరుణం గురురాజ రావు, టీడీపీ జిల్లా నాయకులు, మాజీ జెడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న విషయం తెల్సిందే. గాయాలైన ఇరువర్గాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఇరువర్గాల నాయకులు ఇచ్చిన ఫిర్యాదుతో టీడీపీ వర్గానికి చెందిన ఏడుగురిపై, వైసీపీ వర్గానికి చెందిన నలుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

దుకాణాల అద్దెలు పంచాయతీకే ఇవ్వాలి

మంత్రాలయం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని నది ఒడ్డున నది పరంబోకు స్థలాల్లో నిర్మించిన దుకాణాల అద్దెలు పంచాయతీ అధికారులకే చెల్లించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం.రాజు డిమాండ్ చేశారు.